# సహజమార్గ దశాదేశములు

## వ్యాఖ్యానములు

ఆంగ్ల మూలం


**శ్రీ రాంచంద్ర**

వ్యవస్థాపక అధ్యక్షులు శ్రీ రాంచంద్ర మిషన్

షాజహాన్‌పూర్, యు.పి.


తెలుగు అనువాదం



**శ్రీ రాఘవేంద్ర రావు**




శ్రీ రాంచంద్రజీ మహరాజ్ సేవా ట్రస్టు (రి)

కడప

వారి ప్రచురణ



వరమ వూజ్య మహాత్మా శ్రీ రాంచంద్రజీ మనారాజ్
(లాలాజీ)
ఫతేఘర్, (ఉత్తర ప్రదేష్),
ఇండియా.



పరమపూజ్య మహాత్మా శ్రీ రాంచంద్రజీ మహారాజ్,
(బాబూజీ.)
షాజ హాన్‌పూర్, (ఉత్తర ప్రదేష్),
ఇండియా.

గీ॥ ఎటుల వర్ణింప నేర్తు నే నీ విచిత్ర
పథము ! ఇంద్రియములకును భావముల
కతీత మౌచును, చీకటి తెరకు వెనుక
దాగి, తద్వారముననే "సత్యము" వెలుంగు

# తొలిపలుకు

నేటి ప్రపంచము నూతన ప్రసవవేదనతో నున్నది. ఒక క్రొత్తరకపు సంస్కృతి ప్రభవించుచున్నది. విజ్ఞానశాస్త్రపథములు మనుష్యుని లక్ష్యము, గమ్యముల కొక నూతన తేజమును కల్గించుటకు మార్గము నేర్పరిచినవి. ప్రస్తుతము మనుష్యులందరును ఉత్తమ జీవన పద్ధతులను గూర్చి యోచించుచున్నారు. జీవితము తమ కొఱకో లేక కొందరి కొఱకో గాక అందరి కొఱకని నిర్బంధముగ భావింపవలసి వచ్చుచున్నది. కాని ఆ గమ్యమును చేరుటకు గాని శ్రేయోరాజ్యమును స్థాపించుటకు గాని అనుసరించు విధానములు, సాధనములు తృప్తికరముగ లేవు. తన యభివృద్ధి కొఱకీయబడిన విచక్షణాశక్తిని మనుజుడు అస్తవ్యస్తము చేయుచున్నాడు. ఐనను మనుష్యుడు సుఖమునన్వేషించుచున్నాడనుట యథార్థము. ఈసౌఖ్యమునకు చిత్తశాంతికి మిగుల సన్నిహిత సంబంధమున్నట్లు అగుపడును. మానవుఁడు తాను కేవలము మానవజాతికి సంబంధించియే గాక మనము జీవించు ఈ భూమితోడను ఇతర ప్రపంచములతో సైతము సంబంధము గలిగి యున్నానని గ్రహింపవలెను. విజ్ఞాన శాస్త్రము మన జ్ఞానముయొక్క పరిధిని విశాలమగు దిశలవైపు విస్తరింపఁజేయుచున్నది. మనమొక విశాల ప్రపంచములోనికిఁ ప్రవేశింప మొదలిడి యున్నాము. కాని మన మనస్సులు ఆ ప్రమాణమున కనుగుణముగ నాలోచించుటకు సమర్థములుగలేవు. మనము నిజముగ, ఈ ప్రపంచముతోను, దాని నుండి మనమాశించిన దానితోను సరిపెట్టుకొనుటకు అసమర్థులమై యున్నాము.

మనుఁజుడు తాను నిజముగ జీవులన్నిటిలో గొప్పవాడననియు ఈ ప్రపంచములో కనీసము తన్నుతాదెలిసికొని తన మనః ప్రాణశరీరావసరములను నిర్వహించుకొనుటకైనను సమర్థుఁడనని భావించుచున్నాడు. పెరుగుట, జీవించుట, సుఖమునన్వేషించుట అనువాని కొఱకు జరిగెడి సంఘర్షణలో మితిమీరిన చిత్తైకాగ్రతతో అతడు శ్రమపడుచున్నాడు. తన అవసరములకు, సౌఖ్యమునకు అనుగుణముగా ఈ ప్రపంచమును మార్చుకొనుటచే సుఖమునన్వేషించుట నిష్ప్రయోజనమనియు, ఇట్లు సాధించిన సుఖము అశాశ్వతము, అనిశ్చితము అని గ్రహించ వలెనని కొందరు మహాపురుషులు అభిప్రాయపడుచున్నారనుట నిజము. సాధించిన సుఖము క్షణికమగుటచే నిజమగు సుఖము ఉండజాలదని వారుబోధించుట సత్యమే. "భ్రమ" అను పదమునకు నిర్వచనము సకలసుఖముల యొక్క క్షణికత్వమే యని వారు భావించి యున్నారు. అనంతమై శాశ్వతమైన సుఖము

నన్వేషించుటయే నిజమగు నన్వేషణ. ఇందు కొఱకై క్షణిక సుఖమును అన్వేషించుట త్యజింప వలసిన యవసరము గలదు. కాని అత్యంత దూరమున నున్న శాశ్వత సుఖమునకై చేతిలోగల క్షణిక సుఖమును త్యాగము చేయుటకు మనుష్యుడు సిద్ధముగలేడు. ఈక్షణమున నున్నదానిని విడచుటచే గల్గు శాశ్వత మగు స్వేచ్ఛకంటెను ప్రస్తుతము గల బంధనము సుఖకరముగ నున్నచో అదియే మంచిది. అట్లే అనంతమగు దానిని పొందగలమను వాగ్దానమును నమ్మి సొంతమగు వ్యక్తిత్వమును విడచుటయు అశక్యము.

మనుష్యులు తమ కోర్కెలు నెరవేరుటకు వేరొక పరిష్కారమును కనుగొన్నారనుట సత్యము. మానవ ప్రకృతికి ఉభయలోకములకు సంబంధించిన యవసరమునుబట్టి, మనుజులు అనిత్యమగు దానియందు నిత్యమగు దానిని, అంతముగల దానియందు అనంతమగుదానిని, పరిమితియందు పరిమితిని, జడపదార్థగర్భమున చైతన్యమును సాక్షాత్కారింపజేసికొనఁదలతురు. మనుష్యునకు ఐహికాముష్మిక సుఖములను కోరుటపైగల హక్కునకు న్యాయము గూర్చనెంచు ఎన్నియో తత్త్వదర్శనములుద్భవించినవి. అట్టి కోర్కెలవలన తత్వశాస్త్రములు ప్రభావితములగుననుసత్యము వారి భావనామూలమును వెల్లడిచేయును. 'సుఖము నిత్యమైనను, అనిత్యమైనను, దానిపైగల సకలహక్కులను విడువనిదే సత్యతత్త్వము మన గమ్యముగ ఉండజాలదు' అను విషయమును ఒప్పుకొనవలసియున్నను, అట్టి భావన గమ్యమునకు మార్గదర్శకమగు ప్రేరణనుండి విముక్తము కాలేదు. సుఖము, శక్తి, సంతోషము మొదలగు గమ్యములపైగల కోర్కెచే పరిమితమై దూషితమైన ఆకాంక్ష లేక సత్యతత్త్వమును కేవలము దానికొఱకు మాత్రమే తెలిసికొనవలసిన హక్కు దానికి గలదు. ఆ తత్త్వమును, ఉన్నది వున్నట్లుగానే దాని కొఱకే తెలిసికొనవలెను. అదియే అస్థిత్వము, సత్యత్త్వముయొక్క నియమము. మనుష్యునకు తన సత్యత్త్వమునందే అత్యంతము అభిమానముగలదు. ఆ సత్యత్త్వసాక్షాత్కారమే అతని యస్తిత్వమునకు మూలమగు ప్రేరణము. సుఖసంతోషములు మొదలగునవి సాధనామాత్రములై తన సత్యత్వసాక్షాత్కార మార్గమున సమర్పణ చేయదగియున్నవి.

ఈ సత్యత్త్వమును గూర్చిన జాగృతిని పొందెడి విధానములు మిక్కిలి ప్రాచీనములై మానవుని ద్వివిధములగు లక్ష్యములవలన వివిధములగు ఫలితములను గలిగియున్నవి. తన్నుతాను తనయందు వెదికి నపుడే సత్యత్త్వ సాక్షాత్కారమగును గాని ఆత్మసాక్షాత్కారమునకు ప్రపంచమువైపు తిరిగినచో దానియందు తన్నుతా దెలిసికొనుట సాధ్యముగాదు. తమ

విధానముల నూహించి నిర్మించిన తత్త్వశాస్త్రము లెన్నియోగలవు. కాని అవి సత్యత్వమును గూర్చిన జాగృతికి మార్గము చూపుటకు సమర్థములు గాకున్నవి. వీని సహాయముతో ముక్తిని పొందుట వీలుగాలేదు.

పరతత్త్వమును గూర్చిన యనుభవము స్వయముగ పొందుట మిగుల అవసరమైయున్నది. తత్త్వశాస్త్రము, తర్కము యుక్తియుక్తమగు విచారణచే విసుగు జెందిన మనుష్యులు, ఏవిధానముచే అస్తిత్వముయొక్క సారమును, అనుభవము సహజజ్ఞానము సాక్షాత్కారమును పొందఁగలరో అట్టి విధానము వైపు మరలుచున్నారు. ప్రత్యక్షానుభవము మాత్రమే సమస్యలను పరిష్కరింపగలదని భావించని వారును కొందరుగలరు. విధానములు, తత్త్వశాస్త్ర సాధనములపైగల విశ్వాసము మాత్రమే చాలుననియు, స్వానుభవము కేవలము ఆకర్షణలేక భ్రమాత్మకమై ఎండమావులవంటిదని నమ్మువారును కొందరుగలరు. ఇట్లు తలచువారితో మేమేకీభవించము. మనుష్యుడు ఎన్నడునూ ఏకీభవింపలేడు. ఈస్వానుభవము అత్యున్నతమైనదై ఉండవలెననుట నిజమే. అది వ్యక్తిగతమగు కోర్కెలపరిణామమగు భ్రమ రూపముగ గాని సంకల్పరూప పరిణామముగాని అగుటచే సత్యముగాదనుటయు నిజమే. ప్రకృతిని గూర్చిన యనుభవములకు బదులు వేరొక తరహా భ్రమాత్మకమగు అనుభవములను మనోగోచరము చేసికొనుటయే చిత్తవిభ్రమ మనబడును.

ఉన్నత ప్రజ్ఞలేక సత్యత్వము లోనికి పరిణామమొందుట నిజముగ మన ప్రయత్నమే. మానవునితో గూడ ఇతర తక్కువజాతి జీవజాలమునకు తగిన పాతవిధానములచే ఈ వికాసము పొందనలవిగాదు. సర్వమును ఖండఖండములుగ గ్రహించుటకంటెను ఒకే ప్రజ్ఞతో సామూహికముగ గ్రహింపగల విశ్వప్రజ్ఞ లేక అంతర్జ్ఞానముయొక్క పరిణతి గాని, సర్వజ్ఞానమును ఏకమగునట్లుచేసి అట్టి ఏకైక సత్యమును దర్శింపఁగల ప్రజ్ఞగాని భగవద్దత్తమగు బహుమానమే గాని మన మభిలషించిన సహజవిధానములచే పొందనెంచుట కలవిగాదు. పరిసరములను తన యవసరముల కనుగుణముగ పొందుపరుచుకొనఁగల మనుజుని అపారసామర్థ్యమువలనను, తనలో గుప్తముగనున్న వివేచనాశక్తి, ధీశక్తి, సహజసిద్ధమగు తెలివి, ధృఢసంకల్పము, చేతనత, సృజనాత్మక కల్పన, సహకార ప్రవృత్తి, సాంఘికసమైక్యత మొదలగు శక్తి సామర్థ్యములను ప్రేరేపించి ఉత్తేజపరచుటచేతను ఈ సహజ వికాసము సంభవమని విజ్ఞానశాస్త్రమాసించును. కాని జీవితము యొక్క ఈ

యుత్థానము విరామములతో గూడియున్నది. ఈ విరామములు, లేక లంఘనములు సహజశక్తి, లేక చుఱుకుదనముచే ప్రేరితములా, లేక జీవితమును పైకెత్తుటకుదానివైపు వ్రాలిన ఊర్ధ్వగమన శక్తి ప్రేరితములా అని ఎవరైనను ఆశ్చర్యపడుదురు. మనుష్యునిలో గల మత సంబంధమగు ననుభవము, ఈ విశ్వచేతన లేకసర్వమును అధిగమించిన భగవత్కృప దీనివైపు మొగ్గుచున్నదని ఎఱుకపరచుచున్నది. ఈ విధముగ దివ్యత్వమానవత్వముల సమ్మేళనము తొలిసారిగా మానవుని పరిణామమునందు సాధ్యమైనది. కాని పరచేతన శ్రేష్ఠమగు అస్తిత్వము వైపునకు దూకుట సుదూరమున నున్నది. తన శక్తి కంటెను విశాలమై శ్రేష్ఠమైన మరియొక శక్తి తనకు చేయూతనిచ్చుచున్నదని మానవుని జీవితపరిణామములో అతనికి విశదమగుచున్నది. ఆధ్యాత్మికతా భావమునకు ఇదియే తొలిమెట్టు. ఆత్మ ఇపుడొక గాఢమగు ప్రోత్సాహమునెదుర్కొనును. ఈపరమ సత్యసాక్షాత్కారముకొరకే ఈయాకాంక్ష. ఇదిలేనిచో మనుజుని భావి అశక్యము అరక్షితము.

ఇదియే ఆత్మవిజ్ఞానము కొరకు పిలుపు. పరిపూర్ణతకు పరమసుఖమునకు, పరమానందమునకు ఆహ్వానము. తన మూలస్వభావమునందే జారిపోవునట్లు కనబడెడి తన సత్యత్వ సాక్షాత్కారమునకై పిలుపు.

ఉన్నతచేతన, లేక పరచేతనాస్థితి, ఎఱుక, మొదలగు ఉన్నత భూమికలకు మనుజుని గొంపోవుటకు అత్యున్నతమగు పరతత్త్వముయొక్క సహాయము అత్యవసరమను విషయమును భారతదేశమందలి తత్త్వద్రష్టలు చాలాకాలము క్రిందటనే గుర్తించిరి. అధిమనస్సు మానవ మనోమండలము కంటెను ఉన్నతమగు మండలమునకు సంబంధించినది. అండ,పిండ, బ్రహ్మాండ, పరబ్రహ్మాండములని పిలువబడెడి మండలములు చేతనాస్థిత్వముయొక్క మెట్లు గలవు. వీనికంటెను పరమై అత్యున్నతమై కేంద్రమండలము, కేంద్రముగలవని షాజహాన్‌పూర్ నివాసి శ్రీ రామచంద్రజీ చెప్పియున్నారు. వీనికిని భూలోక, భువర్లోక, స్వర్లోక, మహాలోక, జనలోక, తపోలోక, సత్యలోకములని వర్ణింపఁబడిన లోకములకును సామ్యముగలదు. ప్రతి స్థితియందును ఆ స్థితికి దిగినట్లు ప్రజ్ఞ ఉన్నతముగ నుండును. అది క్రిందికి దిగినపుడెల్ల రూపాంతరము నంది పరిమితులకు *(Limitations)* లోనగును. ఇట్లు వివిధములగు కేంద్రములు, గ్రంథులు లేక చక్రములు ఏర్పడును. ఇవి అయా కేంద్రనిర్మాణమున నొప్పెడి నియమములననుసరించి చేతనాశక్తిని పంచిపెట్టును.

అందుచే అన్నివిధములగు ప్రజ్ఞాస్థితులకు అతీతమైన అత్యున్నతమగు స్థితిని చేరవలెనని ఆత్మసాక్షాత్కారయోగము కోరును. ఇది సాధ్యమా? అను ప్రశ్న ఉదయించును. ఇది మానవస్థితినుండి అధిమానసస్థితిగల మానవాతీతస్థితికిని, ఇట్లే అత్యున్నతస్థితికిని చేరునంతవరకు మనుష్యునకు సాధ్యమగునట్లు చేయు క్రమమార్గముకాదా? అనునది రెండవ ప్రశ్న. క్రమవికాస సిద్ధాంతమునకు అనుకూలముగ చెప్పవలసినది చాలగలదు. అత్యున్నత స్థానమును పొందవలసిన అవసరమును గుర్తించిన మనుజుని యాత్మకు ఆ స్థానమును చేరుటకు వెనువెంటనే సాధ్యమగునని శ్రీరామచంద్రజీ నమ్మకముగ పల్కుచున్నారు. పరమగు కేంద్ర సత్యతత్త్వమును పొందినవారు చూపెడి యోగమార్గముచే ఇది తప్పక సులభమే. వ్యక్తి ఈమనుష్యశరీరముతో నున్నను అత్యున్నతమగు ప్రజ్ఞాశక్తిచే పవిత్రము చేయబడి దాని ప్రతియణువును రూపాంతరము చెందిన ఈ మానవ దేహము తోడనే అట్టి పరిణామము శీఘ్రముగ నగును.

ఆ దివ్యశక్తి మానవ హృదయములోని కవతరించి దానిని పవిత్రమొనర్చి అత్యున్నత స్థితికి మనుష్యుని కొనిపోగలదు. ఈ మానవ శరీరము అత్యున్నతమగు దివ్యశక్తి ప్రసారమును విశ్వ, అధివిశ్వ కేంద్రముల కనురూపమగు వివిధ కేంద్రములనుండి గ్రహించుట కనుగుణముగ నిర్మింపబడిఁయున్నది. ఇట్లు నాడీ మండలము రక్తప్రసరణ మండలము మొదలగు వానితోగూడ ఈ మనుష్య శరీరము, పరిశుద్ధమై ప్రశాంతిని, శక్తిని, వీనికతీతమగు నానందమును ఈ శరీరమునందే అనుభవించగలదు. రాజయోగమున నిపుణుఁడగు వానిచే శిక్షణ పొందుటయే దీనికి సరియగు మార్గము.

'సహజమార్గము - దశాదేశముల వ్యాఖ్యానము' అను నీ పుస్తకమున పరతత్త్వసాక్షాత్కారమునకు అవసరమగు నాదేశములను శ్రీరామచంద్రజీ వివరించియున్నారు. ఈ నియమములు లేక ఆదేశములను ప్రతియొకరును విధిగా అనుసరించవలెను. ఇవి చేరవలసిన గమ్యమును గూర్చి సహేతుకముగ స్పష్టముగా వివరింపబడినవేగాని నిరంకుశమగు నాజ్ఞలుగావు. గమ్యమును, లేక పరమును చేరవలెనని హృదయపూర్వకమగు వాంఛయున్నచో ఈ నియమముల ననుసరించుట మిగుల సులభమే.

ప్రార్థన యందలి ఈ సరళసూత్రము మన అన్వేషణయందలి ముఖ్యోద్దేశమును తెలుపును. సర్వమునకును ప్రభువు భగవంతుఁడే. మనలను మన గమ్యమునకు గొంపోగలవాఁడు అతఁడొక్కడే. గమ్యమును చేరుటకు మన ఐహిక వాంఛలే మన

కపరోధము గలిగించుచున్నవి. అవియే మన ప్రాప్తికి విరోధులు. ఇందులకు సర్వశక్తియుతుడగు పరమేశ్వరుని శరణుజొచ్చుట అత్యవసరము. ఏలయనగా భగవంతుఁడే మార్గమును, గమ్యమునైయున్నాడు. పరతత్త్వముతో సంపూర్ణముగ లీనమై, భగవదన్వేషణలో శ్రమపడుచు సహాయమునర్థించు ఆత్మవైపునకవతరించిన భగవంతుడో యనుట్లు మనలను అత్యున్నతస్థితికి గొనిపోయెడి గురువునుగలడు.

'ఉదయ' మధ్యాహ్న, సాయం సంధ్యాసమయములందు చేయదగిన ఉపాసన, పూజ, ధ్యానములయొక్క ప్రాచీన సాధనా విధానములు ఈపుస్తకమున సొంపుగను, సహేతుకముగను వర్ణింపబడినవి. యోగాంగములు సుందరముగ వివరింపబడినవి. అధ్యాత్మిక సాధన గమ్యము, లేక ధ్యేయమున కనుగుణమగునట్లు జతపరచుటకు సహజ విధానము సరళముగను సూటిగను తెలుపబడినది. అభ్యాసియొక్క మనోమయకోశము మాస్టర్‌యొక్క 'ప్రాణాహుతి' యనెడి సూక్ష్మాతిసూక్ష్మ యోగ విధానముచే పరిశుద్ధము గావింపబడుట ఇటీవలి అధ్యాత్మిక చరిత్రయందే అసమానమైయున్నది. 'భగవంతునియందు, భగవంతునితో భగవంతునికొఱకే జీవించుట' అనునదే సహజమార్గసాధనయందలి సారాంశము. ఇది సహజముగనే భగవంతునియందు తన సత్యత్వ సాక్షాత్కారమునకు మార్గముచూపును. అట్లే సాధకుడు ఏ విభేధము లేక అందరియెడలను సమరసభావముతో నుండును. భగవంతునియందు, అతనికొరకే జీవించుచు ఆయనతో నేకమైన వారికి ఊర్ధ్వలోక ద్వారములు వివృతమగును. అధ్యాత్మికత మతమువలె ఒక పూజావిధానము, ఆచరణతంత్రముకాదు. అది భగవంతుని ఎఱుకలోను ఆయన సారమునందు ను జీవించుటయే.

సహజమార్గనియమములను అనుసరించుటచే తొలి స్పర్శతోడనే వ్యక్తియొక్క ఆత్మ ఊహాతీతమగు ప్రశాంతి ననుభవించి దానిలోఅభివృద్ధి చెంది మనుజునకు సాధ్యమగు అత్యున్నతస్థితిని ఎట్లు పొందఁగలదో శ్రీరామచంద్రజీ తెలిపియున్నారు. ముక్తి లేక మోక్షము అనునది ఈ సాధనకు సహజఫలమే. దైవముచే నడుపఁబడెడి వానికి పరిపూర్ణతయు లభించును.

ఈ వివరణలో కొంత తత్త్వము, భౌతిక విజ్ఞానము గలదు. ఈ విషయమును చర్చించుట అంతముఖ్యముగాదు. అభ్యాసమున ముందుకు సాగుచున్నచో అది స్పష్టము కాగలదు.

మనుష్యుని స్వభావము సంపూర్ణముగ పరివర్తన చెందవలెనను విషయమున సందేహములేదు. అతని సిద్ధి సత్యమేయని అనుభవమునకు రావలెనన్నచో అతనికి, విశ్వ, విశ్వాతీతమగు ప్రకృతియే మార్గదర్శికావలెను. కేంద్రమును సమీపించినకొలది మనుజుని సత్యత్వము అభివృద్ధియగును. అంతకుముందు గడచినదంతయు అసత్యమనితోచును. ఐనను కేంద్రమును సమీపించినకొలది ఉద్భవించెడి అతిశయమగు సత్యమును పొందుటయే అభ్యాసి యుద్దేశము.

ఈ క్షేత్రమున (రంగమున) శ్రీరామచంద్రజీ వారి నూతన సృష్టి శక్తిసంపన్నమై ఆచరణయోగ్యమగుటచే సుప్రసిద్ధమైయున్నది. భగవంతుడు దూరముగలేడు. మన సమీపముననే సిద్ధోపాయమై యున్నాడు. అయన సామీప్యతను, మనుజునిలో పరివర్తన తేగల ఆయనశక్తిని గుర్తించుటకు మనుష్యుఁడు ఆయనకు అభిముఖుడైన చాలును. ఈ యనుభూతి అందరికిని సాధ్యమగునట్లు చేసిన ఫతేఘర్ నివాసి శ్రీరామచంద్రజీ వారికిని, తనవైపు మరలినవారికి ప్రత్యక్షముగ ప్రయోగము చేసి చూపుటచే పరివర్తన, విముక్తి రాగలదను శుభ వార్త వ్యాపింపఁజేసిన షహజహాన్‌పూర్ వాసి శ్రీ రామచంద్రజీ వారికిని మనమెంతో ఋణపడియున్నాము.

ఒక విధముగ ఈ గ్రంథము అభ్యాసమున పురోగమించిన సాధకునికొరకే. కాని ఇది మిగుల జ్ఞానదాయకమై మాస్టర్ రచించిన 'సత్యోదయము, రాజయోగ ప్రభావము' అను గ్రంథములు పరిశీలనాదృష్టితో చదివిన తరువాత చదువవలెను.

8-జి, కార్ స్ట్రీట్,
తిరుపతి.

డా॥ కె.సి. వరదాచారి,
యం.ఎ., పి.హెచ్.డి.

# ఉపోద్ఘాతము

ప్రపంచమందలి ప్రతి సంస్థకును ప్రత్యేకమగు లక్షణముగలదు. దాని భావముల కన్నిటికిని అదియే కేంద్రము. అట్టి ప్రతి సంస్థకును ఒక మహాపురుషుఁడు స్థాపకుడు. అతఁడు దివ్యత్వమునుండి అవతరించి, భగవత్సంకల్పమునకు అనుగుణముగ పనిచేయును. ఈ విశ్వమును అవసరమగు రీతిని ఆదర్శప్రాయముగా వ్యవస్థాపన చేయుటకు గొప్ప మహాత్ములు జన్మింతురు. ప్రపంచమున అజ్ఞాన తిమిరము దట్టముగ వ్యాపించి యున్నపుడు ఆ చీకటిని పారద్రోలుటకు ఇట్టి వ్యక్తి భూమిపై నవతరించును.

ఆధ్యాత్మిక రంగమున హిందువులు తమ కర్తవ్యమును మరచుటచే దానికి దూరమైరి. అది ఇతరుల చేతిలోనికి పోయెను. తత్ఫలితముగ సత్యమును గూర్చిన ఎఱుక వారిలో నశించెను. ఈ కారణముచే ప్రపంచ పునరుజ్జీవమునకు సమర్థ గరుమహాత్మా శ్రీ రామచంద్రజీ (ఫతేఘడ్) వంటి మహనీయుని భూమిపై నవతరించజేయవలసిన అవసరము గలదని ప్రకృతి తలచెను. ఆయన క్రీ.శ. 1873 సంవత్సరము ఫిబ్రవరి 2వ తేదీ వసంత పంచమి శుభదినమున జన్మించెను. ఆయన ఆధ్యాత్మిక రంగమున తన పాత్రను పూర్తిగ నిర్వహించి ఆ బాధ్యతను పరమయోగ్యుఁడగు తన శిష్యుఁడు మహాత్మా రామచంద్రజీ (షహజహాన్ పూర్) కప్పగించి ఈ భౌతిక ప్రపంచమును వీడెను. ఆయన మాస్టర్ జీవించియుండగనే అంతిమ గమ్యమును చేరుటకు వలసిన ఉన్నత స్థితులను శ్రీరామచంద్రజీ (షహజహాన్‌పూర్) పొందియుండెను. ఐనను మాస్టర్ పరబ్రహ్మమునందు లీనమైన 12 సంవత్సరముల తరువాతనే ఆయన సంకల్పము కార్యరూపము ధరించెను. పూర్వకాలపు మహాపురుషుల విషయమిట్లే యుండెను. ఇందులకనేక యుదాహరణలు గలవు. ప్రకృతియాజ్ఞల కనుగుణముగ ఏదైనను మార్పుచేయుచు తమకార్యము నెరవేర్చుటకు అట్టి మహాపురుషులకు విచక్షణతో గూడిన స్వేచ్ఛగలదు. తన ప్రతినిధిగా పనిచేయుటకు సామర్థ్యముగల తన శిష్యులలో నెవరియందైనను తాను ప్రవేశించి రూపాంతరము చెందగల శక్తి సమర్థగురువునకుఁగలదు. తదనుగుణముగ ఆ మహాపురుషుడు 1928 లో షహజహాన్ పూర్ సత్సంగములోని ఒకయోగ్యుడగు శిష్యుని తో 'రామచంద్రుడు కుల దీపకుఁడగును' అని తన భావమును విశదపరచెను. ఈ సత్యము ఇతర సహచరులకు సైతము తెలుపబడెను.

మరియొక వ్యక్తిని తనతో సమానుని చేయుట పరమగురువులవంటి మహాపురుషులకు విచిత్ర విషయముగాదు. వీక్షణమాత్రముననే ఆ కాలమున కవసరమగు వ్యక్తిని సంపూర్ణముగ మార్చగల అద్భుత సామర్థ్యము ఆయనకుగలదని ఆయన యనుచరులలో ప్రతి యొకనికిని తెలియును. అపారమగు ఆయన శక్తి, సామర్థ్యములకు విలువగట్టుటకు పరమేశ్వరునకుఁదప్ప మరియొకరి కసాధ్యము. ఈ నియమములు వానిని వివరించు తాత్విక వ్యాఖ్యానము ఆయనకుగల అపరిమిత సామర్థ్యమును ప్రదర్శించును. ఈ యాధ్యాత్మిక తత్త్వము, దీనిని నియమపూర్వకముగ పఠించువారిని, దీనిని గ్రహించగల సామర్థ్యము గలవారిని ఆశ్చర్యచకితులనుగా చేయును.

శ్రీరామచంద్రజీ (షహజహాన్‌పూర్) వారి హృదయమునుండి ప్రవహించెడి భావనా తరంగ ప్రవాహమునుబట్టి ఆయన ప్రతిభను తెలిసికొనవచ్చును. జీవిత సమస్యకు పరిష్కారముగ ఆయన 'సహజమార్గము' అను విధానమును ప్రచారముచేసెను. ఈపేరు ఊర్ధ్వము నుండి నేరుగ అవతరించినదే. మనుష్యులు దానిని నమ్మవచ్చును, నమ్మకపోవచ్చును. కాని ప్రకృతి గమనము (కాలగతి) దానినే సూచించుచున్నది. ఈ విషయమున వివాదము లుండవచ్చును. పూర్వకాలపు మహాపురుషులలో ననేకుల విషయమున ఇట్లే జరిగియుండెను. ఆ కాలపు మనుష్యులు ఆ మహాపురుషులను దూషించిరి. శ్రీకృష్ణభగవానుఁడే ఇందుకు నిదర్శనము. అట్టి మహాపురుషుల యోగ్యతను ప్రత్యక్షముగ తెలిసికొనకయే మనుజులు తమ నిశ్చితాభిప్రాయమును వెల్లడించుటయే దీనికి ముఖ్యకారణము. ప్రకృతినుండి ఆయనకు సంక్రమించిన ఉదారస్వభావము ఆయన దృష్టిని మానవసంక్షేమమున కుపయుక్తమగు విషయములపై మరల్చును. ఆ కార్యము నెరవేర్చుటకు దగిన శక్తిని ఆయన ప్రకృతినుండి గ్రహించును. ప్రకృతి ఆయనకడ దేనిని గాని దాచదు. దివ్యసంకల్పమున కనుగుణముగ మానవజాతియొక్క ఆధ్యాత్మిక పునరుజ్జీవముకొఱకు తగిన విధానముల నెల్ల ఆయన ఉపయోగించును. తనకు యోగ్యమని తోచిన విధముగ ప్రపంచ పరివర్తనమునకు, మధ్య సంభవించు సంఘటనలను లక్ష్యము సేయకయే పనిచేయుటకు ఆయనకు స్వేచ్ఛగలదు. ఆయన కార్యములో ప్రకృతి సహజముగనే సహాయపడును. ఇది కేవలము మానవ సంక్షేమమునకు మాత్రమే. ఇది మార్చుటకసాధ్యమైన ప్రకృతి శాసనము. ఆయనకు మూలమునుండియే ఆదేశములు వచ్చును. ఆ వచ్చిన యాదేశములపై తన యిచ్ఛ వచ్చిన విధమున పనిచేయుటకు ఆయనకు స్వేచ్ఛగలదు. సహజమార్గవిధానమును వివరించినవారును ఈ విషయమున

స్వేచ్ఛగలిగియుండుటచే మానవజాతి అధ్యాత్మికాభివృద్ధికి దీక్షవహించియున్నాడు. ఆ పురాతన విధానమే భగవంతుని దివ్యాదేశముచే క్రొత్త రూపముతో పునరుద్ధరింపబ(డినది. నియమములు ఏర్పరచ(బడినవి. ఇంతవరకును తీవ్రముగ నిర్లక్ష్యము చేయబడిన మూలతత్త్వము వెలుగులోనికి తేబడినది. ఇందుచే ఈ విధానమును వివరించినవారి అద్భుత సామర్థ్యము రుజువైనది. మనుష్యునకును భగవంతునకును మధ్యగల శక్తివంతమగు సంబంధము ఇందులో చర్చింపబడినది. ఈ చర్చ తత్త్వవేత్తలను తీవ్రముగ నాలోచించుటకు ప్రేరేపింపవచ్చును. ఇందుచే రెండు విధములగు ప్రయోజనములు లభించును. నిత్యజీవితములో వీనిని ఆచరణయందుంచుటచే మనుష్యుడు తన నిజస్వరూపమును పొందగలడు. ఈ శాస్త్రమును గూర్చిన తత్త్వజ్ఞానమును కోరువారు మానసికముగ ఉల్లాసమును పొందగలరు. కాని ఈ విధానముయొక్క అనుభవపూర్వకమగు నాచరణమే మానవుని భవిష్యజ్జీవితమును మలచ(గలదు. ఈ నూతన ఆధ్యాత్మిక మార్గకల్పన చేసినవారి సహచర్యముతోడనే జిజ్ఞాసువునకిది సాధ్యమగును. ఈ గ్రంథమును శ్రద్ధతో పఠించిన వారికి ఇది ఆశ్చర్యము కలిగించును.

తమ అంతర్దృష్టితో విషయమును ప్రత్యక్షముగ దర్శనము చేసికొనుడని ఈ గ్రంథము చదివెడి ప్రతి వ్యక్తిని నేను ప్రోత్సహింతును. అప్పుడు మాత్రమే వారికి సత్యము బహిరంగమగును. ప్రకృతి రహస్యములు యోగి హృదయమున భద్రపరుచబడియున్నవి. వీనిని గుర్తించినవారే ఈ ఆధ్యాత్మిక శాస్త్రమును సమీపించగలరు. యోగి యొక్క సూచనలను నియమానుసారముగ అభ్యసించిన వారికేఇది సాధ్యమగును. సాధారణముగ ఇదియొక జటిలమగు సమస్యయని మనుష్యులు అపార్థము చేసికొందురు. కాని ఇట్టి భావనయే మనకు అడ్డముగ నున్నతెర. ఇది తొలగినచో సులభ విషయమును, సులభమార్గమున సాధింపవచ్చును. ఈ పుస్తకమునందలి ప్రతి వాక్యము అర్థయుక్తమై యున్నది. ఈ గ్రంథమును చదివి ఆనందించుడు. సాధనచేసి అనుభూతిని పొందుడు.

కరుణాశంకర్ , పూరన్‌పూర్,

జిల్లా : ఫిల్ భిత్

# సమర్థ గురుమహాత్మా శ్రీ రామచంద్రజీ మహరాజ్

ఫతేగడ్ (యు.పి.) వారి సంస్మరణార్థము

శ్రీ మదనమోహన్‌లాల్‌చే రచింపబడిన

## శ్రద్ధాంజలి

(ఆంధ్రానువాదము)

1. నీవు దివ్యజ్ఞాన భాస్కరుడవు. అందలి రహస్యములన్నియు గ్రహించిన విజ్ఞానివి. సత్పథము ననుసరించువారికి నీవు మార్గదర్శివి. జ్ఞానమునకు జీవమును, ఆత్మయునీవే.

2. నీ జీవితమందలి ప్రతిదశయును ఆధ్యాత్మిక వైభవముతో పరిపూర్ణమైయున్నది. నీ ప్రతి చర్యయు దివ్యజ్ఞానజ్యోతిని ప్రదర్శించినది.

3. నీ భౌతిక కాయము నేడు లేకున్నను నీ సమాధి ఇంకను దివ్యకాంతితో వెలుగుచున్నది. అందలి ప్రతియణువును ఆధ్యాత్మిక మనోజ్ఞతను ప్రర్శించుచున్నది.

4. విశ్వమందంతటను అజ్ఞానతిమిరము వ్యాపించి యుండుట నీవు చూచినపుడు, ఆధ్యాత్మిక రంగమునంతయు నీవు నిశితమగు సమగ్రపరిశీలన గావించితివి.

5. నీ నూతన సృష్టి సహజమగు నాధ్యాత్మిక మార్గమునకు పునాది వేసినది. దానిపై ఆధ్యాత్మిక భవనము నిర్మించినది.

6. ఆధ్యాత్మిక వాతావరణమును దివ్యతేజముతో నింపిన నీ భ్రూవిక్షేపమునందెంత మహత్త్వమున్నది!

7. నీవొక నూతనోత్సాహమును ప్రవేశపెట్టితివి. నీ యనుగ్రహమింకను అంతటను ప్రవహించుచున్నది. అది ఆధ్యాత్మిక కుసుమోద్యానమునకు వికాసముతో గూడిన నూతనత్వము నొసంగుచున్నది.

8. నీ ప్రతి పల్కును ప్రేమ ప్రవాహమే. ప్రతి సంజ్ఞయు దివ్య రహస్యమును బహిర్గతమొనర్పునదే.

9. నీయోర్పును దీక్షయు విలక్షణమైనవి. సత్యతత్త్వాన్వేషణాపరులు నీకు సంపూర్ణముగ విధేయులై యున్నారు.

10. పరతత్త్వముతో నీవు విలీనమగు సమయమున 'నిజమగు సత్యాన్వేషకుల యదృష్టము మరల ప్రకాశించును. నా భక్తుల కొరకు దివ్యజ్యోతి మరల వెలిగింపబడును. అది తనంతతానే, వెలుగుచున్న జ్యోతి శలభములనాకర్షించినట్లు, సత్యాన్వేషణాతురుల నాకర్షించును' అని పల్కిన పవిత్రవాక్కులు మా యదృష్టవశమున సత్యముగా పరిణమించినవి.

11. దయార్ద్రమగు నీ యనుగ్రహముచే నేడాజ్యోతి మా మధ్య వెలుగుచు దివ్యతత్త్వమును ప్రేమించువారందరికిని వెలుగునిచ్చుచున్నది.

12. ప్రభూ! ప్రతి సత్యాన్వేషకుని నేత్రము - హే బిస్మిల్-, ఆధ్యాత్మిక పుష్పోద్యానము దేదీప్యమానముగా ప్రకాశించుటను తప్పక గుర్తింపగలదు.

# ఒకమాట

ఇంతవరకును హృదయమునుండి హృదయమునకు మాత్రమే ప్రవహించిన అధ్యాత్మిక రహస్యములను ఈ గ్రంథమున వాగ్రూపమున నుంచుటకు బ్రయత్నించితిని. కాని అవి ప్రకృతియొక్క అంతరవలోకనపై ఆధారపడిన ప్రత్యక్ష దర్శనమునకు సంబంధించి యుండుటచే వానిని స్పందనముల మూలముననే ప్రకటించుటకు సాధ్యమగును. అందుచే మాటలలో వానిని సంపూర్ణముగా తెలుపుట కష్టమే గాక అసాధ్యముగూడ.

"నిజమగు ప్రేమను మాటలలో ప్రకటించుటకు సాధ్యముగాదు. కేవలసత్యమగు దీనిని ఏ విధముగను వివరింపనలవిగాదు."

కావున పాఠకులుభాషాదోషములను లక్ష్యము చేయక సత్యతత్త్వమును చేరుటకు ప్రయత్నించి తాము లాభమును పొంది ఇతరులును లాభముపొందుటకు సహాయపడవలెనని మాత్రమే ఈ విషయమున నేను చెప్పుచున్నాను.

రామచంద్ర

డిసెంబర్ 8, 1946 గ్రంథకర్త

షహజహాన్‌పూర్ వాస్తవ్యులు శ్రీరామచంద్ర మిషన్ అధ్యక్షులు మహాత్మా శ్రీ రామచంద్రజీ మహరాజ్ వారిచే ఉర్దూ భాషలో ఈ గ్రంథము తొలుదొల్త రచింపబడినది. తరువాత దీనిని రాఘవేంద్రరావుగారు ఆంగ్లమున కనువదించిరి. ఆంగ్లముగాని ఉర్దూగాని తెలియని ఆంధ్రసోదర సోదరీమణుల కొర్కై ఈ గ్రంథము నాంధ్రీకరించుటకు ప్రయత్నము చేయబడినది. ఆంధ్రీకరణమున భావాభివ్యక్తిలో ఎచటనైనా సందిగ్ధము లేక సంశయము కనబడినచో మూలమగు ఉర్దూ గ్రంథమును చూడవలెనని మనవి చేయుచున్నాము.

దీనిని "మాస్టర్" పాదకమలములపై నొక చిన్న పూజాకుసుమముగా సమర్పణ చేయుచున్నాము.

అనువాదకులు.

# ఆదేశము-1

'సూర్యోదయమునకు పూర్వమే నిదురలెమ్ము. నియమిత సమయమున- సూర్యోదయాత్పూర్వమైనచో మంచిది- నీ పూజ ప్రార్థనలను ఒకే విధమగు ఆసనమున గూర్చుండి చేయుము. పూజాదులకు ప్రత్యేకమగు స్థలమును, ఆసనమును- ఏర్పరచుకొనుము. శారీరక, మానసిక పారిశుద్ధ్య విషయమై ప్రత్యేక శ్రద్ధ వహింపుము'

సృష్ట్యాదినుండియు ప్రజ్వలించుచున్న దివ్యాగ్ని ఇంకను చల్లారలేదు. సృష్టి చేయవలసిన సమయమాసన్నము కాగా నిద్రాణమైయున్న ఆ దివ్యశక్తి 'సృష్టిచేయవలెను' అను సంకల్పరూపమున జాగరితమయ్యెను. ఈ సంకల్ప శక్తి చే సూక్ష్మాణువులు వేడెక్కెను. దీని నుండియే సకల సృష్టియు ఉద్భవించెను. ఇట్లు సృష్టి ఆరంభమైన మొదటి దినముననే తొలిపొర ఏర్పడెను. ఎడతెగని ఈ ఉష్ణీకరణ ప్రభావముచే ఆ సూక్ష్మాణువులలో చలనమేర్పడెను. చలనము తీవ్రతరమగుకొలది ఒక పొరపై మరియొక పొర చుట్టుకొనసాగెను. ఈ ప్రకంపనలు అధికమగుకొలది ఆ సూక్ష్మాణువులలో నొక విధమగు సాంద్రత (Grossness) అభివృద్ధి నొందనారంభించెను.అస్థిరత్వముగూడ వర్ధిల్లెను. ప్రతి యణువునకును ప్రత్యేక వ్యక్తిత్వ మేర్పడి అది తన కార్యమునారంభించెను. ఈ చలన క్రియ అధికమగుకొలది పట్టుకాయచేనావరింపఁబడిన పట్టుపురుగువలె సత్యతత్త్వము ఈ పొరలచే చుట్టుకొనబడెను. అందుచే గ్రుడ్డుయొక్క తెల్లని పెంకుమాత్రము కనబడుచు లోపలి పదార్థము కనబడని విధమున స్థూలములగు పై ఆవరణములు మాత్రము కనబడుచు వానిలో నణగియున్న సత్పదార్థము కనుమరుగైనది. క్రియ ప్రతిక్రియలు ప్రారంభమైనవి.

ఆ దివ్యశక్తితో సన్నిహిత సంబంధము కలిగివానికి ఆశక్తిలో నెక్కువభాగము లభించినది. సృష్టికి తొలి దినముననున్న దివ్యాగ్ని మనుష్యునిలో ప్రకటీకృతమైనది. ఈ వేడిమి క్రమముగా నభివృద్ధిచెంది పరిపక్వమై స్థూల రూపముగ బరిణమించినది. ఇట్లు ప్రతి సూక్ష్మాణువు ఆ దివ్య శక్తి చే ప్రభావితమై తన భాగమును గ్రహించి తనలో నిముడ్చుకొనెను. దానికి భౌతిక సంసర్గము సూక్ష్మముగా కలుగుటచే ఆ యణువు దేనిలోని భాగమో దానియొక్క ప్రభావమునకు లోనయ్యెను. ఉష్ణముచే నేర్పడిన మొదటి పెద్దపొర

దానితో సంసర్గము గల్గియుండెను. పెద్ద దానిపై గలిగిన ప్రభావము సహజముగ చిన్నదానిపై దానిపరిమితి పరిమాణములకు అనుగుణముగ ప్రతిబింబించును. బాహ్యశక్తి ప్రభావమునకు లోనైన వస్తువులన్నియు వాని పరిమాణముననుసరించి సూర్యకిరణ ప్రభావమునకు లోనగును.

బాహ్యకారణములచే గల్గిన ఉష్ణోగ్రత కొంతకాలమునకు తగ్గిపోవును. అది సంపూర్ణముగ తగ్గిపోయిన వెంటనే నిజమగు సౌఖ్యము కల్గును. వేసవికాలమును గమనించినచో బాహ్యకారణము (సూర్యరశ్మియొక్క తీవ్రత)చే గలిగిన యుష్ణతీవ్రత పూర్తిగ ఉపశమించగనే మనకు కొంత సౌఖ్యము విశ్రాంతి తప్పక అనుభూతములగును. బాహ్యోష్ణప్రభావము క్రమముగ తగ్గి శైత్య ప్రభావము ప్రవేశించు సమయము, అనగా ఈ రెంటి సంధి సమయమే సంధిగతియనబడుచున్నది. మహాత్ముల దృష్టిలో ఇదియే సంధ్యోపాసనకు అత్యుత్తమ సమయము.

ఉష్ణమునకు వ్యతిరేకముగ ప్రభవించిన వస్తువు ఉద్భవించిన కాలమిదియే. సృష్టి సమయమున నుద్భవించిన యుష్ణోగ్రతకు పూర్వముండినదియు ఈ వస్తువే. ప్రకృతికత్యంతానుగుణమైనది లేక సన్నిహితత్త్వమును చెందియుండినది ఇదియే. మన గమ్యస్థానమగు అత్యుత్తమ స్థితియొక్క ప్రతిబింబమిదియే. ఇట్లు మనము బయలుదేరు స్థానము మన గమ్యమునకు మిగుల సన్నిహితముగను అనుగుణముగను ఉన్నది.

'తమ్' అను మధ్యాహ్న సమయమునగూడ సంధ్యోపాసన ముఖ్యమే కాని ఆ సమయమున శక్తి మరియొక రూపమున వినియోగింపబడుచున్నది. అప్పుడు సూర్యకిరణములు సూటిగ ప్రసరించుటచే ఉష్ణోగ్రత ఎక్కువగుచున్నది. మూలమునుండి వెలువడు శాశ్వతోష్ణము సూర్యుని యుష్ణముతో సంబంధము గల్గియుండును. ఈ విధముగ భౌతికమగు సూర్యుని ఉష్ణశక్తి మూలమున మనము అనంతమగు ఈశ్వరీయ శక్తితో పరోక్షముగ సంబంధము గల్గి దానికి మిగుల సన్నిహితులమగుచున్నాము. సూర్యుని ఉష్ణోగ్రతా ప్రభావము క్రమముగ తగ్గి దానివలన సంపూర్ణ ఫలితము మనము పొందువరకును ఈ సంబంధముండును. దీని తరువాత వచ్చు స్థితియొక్క అనుభూతిని మనకు చవిచూపి, అనంత శక్తికి మనము మరింత సన్నిహితులమగుటకు ఇది సాయపడును. అందుచే

మహర్షులు మధ్యాహ్న సమయమున గూడ సంధ్యోపాసన చేయవలెనని యుద్బోధించిరి. కారణమేమన సూర్యకిరణములు తాముద్భవించినట్టిదియు, పరతత్త్వమునకు సమీపమున నున్నదియునగు స్థానమునకు సన్నిహితములై పరతత్త్వ ప్రభావముతో ఎడతెగని సంబంధము గల్గియుండును.

మధ్యాహ్న సమయమున సూర్యకిరణములు సూటిగా ప్రసరించుటచే వాని సామీప్యమువలన గలిగెడి ఫలితము ప్రత్యక్షముగ నుండును. సుర్యుని నుండి వచ్చునట్లు అగపడు ఉష్ణము నిజముగా సూక్ష్మాణువులనుండి వచ్చు ఉష్ణమే. అందుచే మధ్యాహ్న సమయమున మనము ధ్యానము చేయుచో మనకెఱుకలేకయే మన భావనాశక్తి కేంద్రము లేక పరతత్త్వముతో సంబంధము కలిగించుకొనును. మరియొక విధముగ చెప్పవలెనన్నచో మనమొక సమస్యను పరిష్కరింపఁదలచినచో ముందుగా పరిష్కారమును ఊహించుకొందుము. అట్లే జీవిత సమస్యాపరిష్కారమునకు మన దృష్టికగోచరమగు సత్యపదార్థమొకటిగలదని యూహింతుము. దీనికి కారణమేమన చివర ఘట్టమును మనము చేరగనే అంతకు పూర్వ విషయములను గూర్చిన జ్ఞానము నశించును. ఈ విధముగ ఆ అత్యధికోష్ణ ప్రభావమును మనము మనకనుకూలముగ వినియోగించుకొందుము. కాని మధ్యాహ్న సమయమందలి భౌతికోష్ణము తీవ్రముగనుండుటచే సహజమార్గమునందు మధ్యాహ్న సంధ్యోపాసనము ఆవశ్యకమని నియమింపబడలేదు.

మధ్యాహ్నము తరువాత క్రమముగ ఉష్ణము తగ్గనారంభించుటచే మనము శైత్యమునకు సన్నిహితులమగుచు సమశీతోష్ణములు గల సాయంసమయమును సమీపింతుము. ఇదియే సంధ్యోపాసనకు నియమింపఁబడిన సమయము. ఈ సమయమందలి శైత్యమునకు మనము సన్నిహితులమై చేసెడి ధ్యానము వలన సంపూర్ణమగు ఫలితమును పొందునవకాశము మనకుగలదు. కాలము గడచుకొలది మనము క్రమక్రమముగమిక్కిలి చల్లదనమునకు సన్నిహితులమగుచు చివరకు గమ్యమునకు సన్నిధానముననుండు స్థానమును సమీపింతుము. అదియే ఉషఃకాలము. ఈ సమయమున సూర్యకిరణ ప్రభావము చాల తక్కువగనుండును. అందుచే ప్రకృతి యొక్క స్వభావసిద్ధమగు ఫలితమును బట్టియే ధ్యానసంధ్యోపాసనలకు సమయ నిర్ణయము చేయబడుట సశాస్త్రీయము.

సంధ్యోపాసన ఉదయ సాయం సమయములందు మాత్రమే ఏల నిర్ణయింపబడెను? మధ్యాహ్నమునందేల చేయరాదు? అను ప్రశ్నయుదయించును. ఉదయము సత్వప్రధానము. మధ్యాహ్నము రజోప్రధానము,సాయం సమయము తమః ప్రధానము. ఉత్క్రమానుపాత సిద్ధాంతము *(Principle of Investendo)* అందరకును తెలిసినదే. దాని ననుసరించి పై మూడింటిలో ఆద్యంతములు రెండును గ్రహింపబడినవి. 'సత్' అనునది ఆది. 'తమ్' అనునది అంత్యము. వీనిని విలోమము చేసినచో ఆదియగు 'సత్' అంత్యమును అంత్యమగు 'తమ్' ఆదిగను అగును. మధ్యనుండునది మాత్రము మారక అట్లే యుండును. ఇది ఆద్యంతములను కలుపునట్టి ఆధారసూత్రము.

లోకులకు అత్యల్పముగ తెలిసిన ఒక పరమరహస్యమును నేడు వెలువరించుచున్నాను. సామాన్యముగ సత్ అనునదే పరమ సత్యమనియు అదియే పరతత్త్వమును తెలిసికొనుటకు ప్రమాణమనియు మనుజుల యభిప్రాయము. కాని దాని వెనుకనున్న రహస్యమేదియో వారికి తెలియదు. నిజముగ కేవలము 'తమ్' స్థానమే నిజమగుయోగి పొందదగిన గమ్యము. ఈ స్థానమును చేరుట మిగుల దుర్ఘటమనుటలో సందియములేదు. సత్ స్థానమునుపొందుట మిగుల సులభము. కాని తమ్ స్థానము అంతసులభముగ పొందనలవిగానిది. ఐనను అదియే మన పరమగమ్యము. దానికావల నేదియు లేదు. సాదారణముగ మనుజులు గంతవ్యమును గూర్చి ఎక్కువగ మాటలాడినను దానిని సమీపించుటకై ప్రయత్నము చేయువారు చాలనరుదు. పవిత్రత, ప్రశాంతత, నిరాడంబరత కూడ అచట లేవు. నిజమునకు అది వీనికి పరముగ నున్నది. అనేక జన్మల నిరంతర సాధనా ఫలితముగ పొందదగు స్థానమిదియే. ప్రపంచమునందలి గొప్ప యోగులు సైతము ఈ స్థానమును చేరలేదని నేను ధైర్యముతో చెప్పగలను. మీరు వెదుకబోవు సత్యజీవనమగు నిర్వాణస్థితి దీనియందే గలదు. ఈ స్థానమును చేరుటకు ముందే సకల కర్మక్షయమగును. నేనీనాడు బహిరంగపరచిన నిసర్గముయొక్క రహస్యము పరమాత్మ లేక 'భూమ' యొక్క అక్షరేఖ సంపూర్ణముగ ఈబింధువే. సంవత్సరములకొలది అన్వేషించినను జనులెప్పుడును ఈ సత్యస్థితికి వెనుకనే నిలచిపోయిరి. జ్ఞానమిచట ప్రవేశింపజాలదు.

ఈ 'తమ్' స్థితిని మనుజులు తమ క్రూరశత్రువుగ భావింతురు. కాని ఇట్టి సంపూర్ణజ్ఞానస్థితిలో మునిగియున్నవాని నెవనినైనను మనము గమనించినచో అతడు

అత్యున్నతస్థితివైపు పురోగమించి పసిబిడ్డవలె తన స్థితిని తాను తెలియని స్థితిలో నున్నట్లు కనుగొందుము. అట్టి స్థితిలో 'సత్' స్థితియొక్క సూక్ష్మాంశ సంపర్క లేశమైనను అతనికి గలిగినచో వెంటనే అతడు తానున్న 'తమ్' స్థితిని గుర్తింప మొదలిడును. ఈ రెండు స్థితుల యొక్క సంధియే మరి యొకనూతనస్థితి యుద్భవించుటకు గారణమగును. ఈ స్థితియే సృష్టికి అధారమైన స్థితితో సమానమైనది. ఉత్క్రమానుపాత సిద్ధాంతము ఇచ్చటను వర్తించును.

ప్రకృతియందలి భౌతిక వస్తుసముదాయ వ్యక్తీకరణము సృష్టి యందలి మూడవ యంశమునకు సంబంధించినది. మనుజులు పలువిధములగు కోరికలను గోరుచు దీనిలో చిక్కుబడియుందురు. సాధారణముగ కాంతియుతమును ప్రకాశమానమునునగు వస్తుజాలము మన నేత్రముల నాకర్షించును. దానినే మనము 'సత్' అని భ్రమించి అపార్థము చేసికొందుము. ప్రకాశమానమగు నిది మాయయేగాని వేరుగాదు. దీనిని గూర్చి ఎక్కువగ మాటలాడువారు సత్యమునకు చేరువగలేరు సరిగదా ఆధ్యాత్మిక పరిధికిని మిగుల దూరముగన్నువారే. కాని ఈ విషయమును వినుటకుగాని గ్రహించుటకు గాని అలవిగానంత జడతాస్థితిని మనుజులు పెంపొందించుకొనియున్నారు. జ్యోతిస్తమస్సుల కావలనున్న సద్వస్తువు వీరి దృష్టికి దూరమైనది. శ్రీరామచంద్ర మిషన్‌యొక్క చిహ్నమునందు చూపబడినది ఇదియే. మనుజుని యొక్క పరిపూర్ణత్వమునకు నిజమగు స్థితి ఇదియే. ఈ స్థితినుండి పతనమగునవకాశమేలేదు. వేదాంత శాస్త్రమునందిది మిగుల సున్నితమగు నంశము. ప్రకాశాంధకారములుకాని యిట్టి స్థితిని యోగులు సత్పదమనిరి. ఇది సరిగాదు. ఇది సత్పదమునకతీతమైనది.

ఈ స్థితియును నిజముగ జ్యోతిస్తమస్సులకు పరముగనున్న సద్వస్తువుయొక్క ప్రతిబింబము మాత్రమే. నిజముగ సత్యతత్త్వము దీని యావలగలదు. ఈ విషయము పాఠకులకనేకులకు ఆశ్చర్యము కలిగించవచ్చును. అందుచే ఆధ్యాత్మికముగ చాల పురోగమించి ఈ శాస్త్ర విషయపరిజ్ఞానముగల వారికి మాత్రమే ఇది వ్రాయబడినది. ఈ జ్ఞానము ఆచరణ ద్వారా అనుభవసిద్ధమగునే గాని మత విషయిక ప్రామాణ్యములచే లభింపదు. ఇదియొక విశిష్టమార్గము. ప్రత్యేకమగు శాస్త్రము. ప్రకృతిని అంతర్దృష్టితో జూచు నేర్పుగల వారికే గాని ఈ శాస్త్రమును గ్రహించు యోగ్యత కలుగదు. అంతవరకును దీనిని తెలిసికొనుటకును గ్రహించుటకును వీలుగాదు. దీని పరిధి సమీపమునకైనను చేరనలవిగాదు.

ప్రకృతిలో గమనింపదగినది ఏది యోయున్నదని తెలిసికొనుటకు మాత్రమే మతము సహకారియగును. కాని ముత్యములను గ్రహించుటకు అగాధమగు సముద్రపు లోతులకు మునుగక తప్పదు. సత్యస్థితియొక్క పవిత్రత, అమాయికత, నిరాడంబరతలే దానిని మరుగుపరుచు తెరవలెనున్నవి. అందుచే నీ గ్రంథము ఆధ్యాత్మిక విద్యనారంభించెడి వారికిగాక ఆ విద్యలో పరిపూర్ణులైనవారికై వ్రాయబడినది.

బాహ్యమందలి యుష్ణత శరీరమునుండి వెలువడిన ఇతర ప్రభావములు సూర్యరశ్మి శక్తిచే మరల మన శరీరములో ప్రవేశింపకుండుటకును ఆ సంధ్యా సమయమందలి ప్రశాంతతయొక్క సంపూర్ణ ఫలితమును మనము పొందుటకును సూర్యోదయమునకు ముందే సంధ్యోపాసన గావింపవలెనని నిర్దేశింపబడినది.

సాధారణముగా - పాశ్చాత్య సంస్కృతియును ఈ విషయమును సమర్థించుచున్నది. ఒక్కొక్క రకపు పనికి ఒక్కొక్క ప్రత్యేక స్థలము నిర్ణయింపవలెను. ఆ స్థలమునందు ప్రవేశింపగనే ఆ పనికి దోహదము చేయు భావములు మనలో రేకెత్తును. సత్యతత్త్వముతో భావనారూప సంబంధము కల్పించుకొనిన మనుజునకు ఆ మూలతత్త్వమునుండి శక్తి లభించి అతడు శక్తివంతుడగును. ఒకదొక పనిచేయ సంకల్పించు కొన్నచో ఆ సంకల్పమును, ఆ కార్యమును కలుపునట్టి సూత్రము బలవత్తరమై తన సంకల్ప శక్తియొక్క బలమును బట్టి మూలతత్త్వము నుండి అతడు శక్తిని పుంజుకొన నారంభించును. ఆ శక్తిలోనికి ప్రవహింపనారంభించినపుడు ఒకానొక నిర్ణీత సమయములో దానితో మనకు అనుసంధానము కలుగుచున్నది. అపుడు కార్యస్మృతి మన హృదయములందు పునః ప్రవృత్తమగుచున్నది. అపుడే ఏదియో ఒక విధమున దానితో మన యనుబంధమును భావించుటకు మనమారంభింతుము.

మనము ధ్యానమునకు కూర్చుండునట్టి గదిగాని స్థలముగాని మన సంకల్పశక్తిచే ప్రభావితమగుటచే ఒక పవిత్రతాభావము ఆ ప్రదేశము నావరించ నారంభించును. ఆ స్థల ప్రభావము మనకార్య పరిపూర్ణతకు మనకు మిగుల సాయపడును. ఆ ప్రభావమును వలసినంత విస్తరింప చేయగల్గుట మన వ్యక్తి సామర్థ్యములపై నాధారపడి యుండును. ఇట్టి స్థల ప్రభావము కాలము గడచినను సమసిపోదు. యాత్రికులు నేటికిని అట్టి శక్తిచే

ప్రభావితులగుచున్నారనుటకు పవిత్ర యాత్రాస్థలములే ప్రత్యక్ష సాక్ష్యములుగా నున్నవి. ఇంతియేగాదు. వాయువు సర్వవ్యాపి యగుటచే ఈ పవిత్ర వాతావరణ సౌరభమును చుట్టు ప్రక్కలనుండు పౌరలకు గూడ వ్యాపింపచేయును. ప్రతి పౌర యందును సంకోచ, వ్యాకోచములుండుటచే పై విధముగ సంక్రమించిన ప్రభావము క్రమ క్రమముగ నభివృద్ధి యై విస్తరించును.

ఇపుడు అసనమును గురించి వివరింతును. యోగశాస్త్రమునందు యోగ సాదనకు తొలిమెట్టుగా మహాత్ములచే అసనమునకు ప్రాముఖ్యత యొసగబడినది. ఐనను దీని మూల రహస్య మింతవరకును బహిర్గతము చేయబడలేదు. ప్రతి విషయమును దైవనిర్ణీతమగు సమయమునందే వెలుగులోనికి వచ్చును. సృష్టికి పూర్వము సర్వమును నిస్తబ్ధస్థితిలో నుండి దాని మూలమునందణగియుండెను. వ్యక్తిత్వమును గోల్పోయి అవి మూలముతో నైక్యమైయున్నను వాని పూర్వవాసనలు మాత్రము అట్లే నిలచియుండెను. ఏ సత్యతత్త్వముయొక్క నీడయందు అవి ప్రళయాంతము వరకుండెనో దాని ప్రభావముచేతనే వాని యునికి యున్నంత కాలము ఆ పూర్వ వాసనలు నిలచియుండెను. ఈ సంస్కార ప్రభావము తమలోనికి గ్రహించుట ఎంతకాలము కొనసాగెనో నిశ్చయించుట మానవుని యూహకతీతమైనది. కనీసము సృష్ట్యారంభమునుండి వాని యస్తిత్వ కాలమంతయు ఇది తప్పక కొనసాగియుండును. మూల శక్తియొక్క కదలిక (క్షోభ) నుండి కలిగిన సంచలనమే గాని ఈ యనుభవము వేరుగాదు. ఇట్లు ప్రభావితమైన ఈయస్తిత్వము మౌనముగ క్రియాత్మకమై ఇట్లే అనంతకాలముకొనసాగెను. దీనినే 'భూమ' (కేంద్రము)లోని గుప్త చలనమందురు. కేంద్రమున సాంద్రముగనున్న ఈ గుప్తచలనశక్తి పునః సృష్టి రచనకై వెలుపలకు ప్రవహించుటకు మార్గము నేర్పరచుకొనెను. అపుడే మనుజుడుద్భవించెను. ఏ దివ్యశక్తి నుండి మనుజుడుద్భవించెనో అట్టి మూలమునకు మరల చేరవలెననెడి గుప్తమగు నార్తి, అకాంక్ష అపుడే ఉద్భవింపదొడగెను. ఏలయన ఆ దివ్యశక్తి మిగుల శక్తి వంతమగుటచే మనుజుని తన వైపునకాకర్షింపదొడగెను. ఆ శక్తి సారమే సంచలనానంతరము సృష్టికి గారణభూతమై మానవునకును సంక్రమించెను. కాని, చలనమే దాని యాధారమగుటచే అది నిస్తబ్ధస్థితికి వ్యతిరేకముగ నుండెను. అట్టి నిస్తబ్ధస్థితికి చేరవలెనను కోర్కె మనుజునిలో రేకెత్తగనే అతనిలోని చలన శక్తిని సాధ్యమైనంతవరకు నిద్రాణస్థితికి గొనిరావలసిన యావశ్యకత అతనికి గల్గెను. అతడందులకై మార్గములనన్వేషింపసాగెను. సత్యతత్త్వముతో సంబంధముగల గుప్తచలనశక్తి ఆ తత్త్వముకంటెను స్థౌల్యము గలదగుటచే మనుజుడును తన గమ్యమగు

సత్యతత్త్వమును చేరుటకు ఏదోనొక స్థూలమగు సాధనమును చేపట్టుట అవసరమని తలపోసెను. ఈ తలంపు ప్రళయ సమయమందలి సంకోచతను సరిపోలు స్థితిని తనయందు కల్పించుకొనవలెనను నిశ్చయమునకు దారితీసెను. విశ్వమును సమిష్టిగ గ్రహించినప్పుడు ఆత్మ విశ్వవ్యాపియగుటచే అది మనుజునియందును సర్వవ్యాపియై యున్నది. సంకోచమారంభమైనచో ప్రళయస్థితి యారంభమగును. అట్లే మనుజునియందును వ్యక్తిగతమగు సంకోచత, వ్యక్తి ప్రళయమునకు దారి తీయును. అప్పుడు అతడు తన స్థౌల్య స్థితినుండి నిజస్థితికి పురోగమించు చున్నాడని యర్థము. సంకోచత, వ్యాకోచతకు వ్యతిరేకమగుటచే ఎల్లప్పుడును క్రిందినుండి క్రమముగ నూర్ధ్వమునకుబోవు స్వభావముగలది. అందుచే ఊర్ధ్వగమనమునకు మనుజుడు అధోముఖమునుండి పైకి సంకోచించుకొనవలెను. మన కాళ్ళను వానికి సంబంధించిన ఇతర అవయవములను ఒక నిశ్చల స్థితిలోనుంచుట దాని రూపమే. అది ఏ విధముగ చేసినను ఆ రూపము చివరకొక ఆసనమగును. అది మన గమ్యమునకు మార్గమును సుకరము చేయుటచే ఆసనము మిగుల ముఖ్యమైనది. శ్రమ లేకుండునట్లు దైవచింతన చేయుటకెట్టి స్థితి సుఖముగనుండునో అట్టి యాసనమే ఎల్లప్పుడును అనుసరించవలెను. ఈ విధముగ మనుష్యుడు దివ్యశక్తితో సంబంధము గలవాడగుచున్నాడు. కావున పరతత్త్వముతో సంబంధముగల స్థితి ఆధ్యాత్మిక సాదనయొక్క తొలిదశలో సాదనకు మిగుల సహాయపడును.

ఋజుస్థితి (నిట్టనిలువుగా కూర్చుండుట)లో నుండిన సాధకునిపై భగవంతుని దివ్యశక్తి సూటిగా ప్రసరించును. అందుచే పురాతన కాలమునుండియు సంధ్యోపాసన చేయుటకు ఋజుస్థితిలో గూర్చుండుటయే అత్యంత ముపయోకగరమనియు, సుఖకరమనియు భావింపబడినది. సాధకుడు వంకరగగాని, ఏటవాలుగగాని, అస్థిరముగగాని కూర్చొనినచో దైవీశక్తి ప్రవాహమునకు అవరోధము కల్గి కలతనొందును. అందుచే నతడు ఆ శక్తి ప్రభావముయొక్క సంపూర్ణ సత్ఫలితమును పొందజాలడు. ఇట్టి యాద్యాత్మిక సత్ఫలితమును పొందుటకు సాధకుడు సరియైన పద్ధతిలో కూర్చుండవలెను. అట్లు కూర్చుండుట అహంకారసూచకమని కొందరనవచ్చును. కాని అది సరికాదు. కవాతు సమయమున సైనికుడెట్లు నిలచునో అట్లే భగవంత్సానిధ్యమున భక్తుడును, సాధకుడును అదే విధముగ కూర్చుండవలెను. "అట్టెన్షన్" అని యనగానే సైనికుడు తన యధికారిపై దృష్టినిలిపి ఏకాగ్రతతో నిల్చుటయవసరము. ఇది చురుకుదనమును శారీరక,

మానసికోత్సాహమును, ఆరోగ్యమును సూచించును. ఈ సూత్రమే ప్రభువులేక గురువునెదుట సేవకై కూర్చుండు అభ్యాసి విషయమునందును వర్తించును.

శుచిత్వమును గూర్చి హైందవుల యాదర్శము నిజముగ అత్యున్నతమైనది. కాని ప్రస్తుతము ఆ ఆదర్శము మిగుల నధోగతి లోనికి వచ్చి ఊహామాత్రముగానే నిలచినది. ఆ యాదర్శ సిద్ధాంతములన్నియు విస్మరింపబడి వాని యవశేషములు మాత్రము స్నానము పాద ప్రక్షాళన రూపమున నేడు నిలచియున్నవి. మన గమ్యమగు శాశ్వత సద్వస్తువు దోషరహితమై శుచియై యున్నదను భావనపై మన శుచిత్వసిద్ధాంత మాధారపడియున్నది. పరమ పావనమై మల విక్షేప అవరణాది దోషరహితమై అత్యున్నతమైన కేవల పవిత్రతయే మన యాదర్శము. మనమీత్రిదోషములచే కలుషితమైయున్నాముగాన అట్టి యాదర్శమున కెంతయో దిగువనున్నాము. అట్టి యున్నత స్థితియందుండుస్వచ్ఛతను పొందుట మన ధ్యేయముగాన మొదట స్నానాదులవంటి బాహ్యశౌచ క్రియలచే ఆ యాదర్శము ననుకరించుటకు ప్రయత్నింతుము. ఈ బాహ్యప్రయత్నముల ఫలితము మన మనస్సుపై ప్రసరించి మనలో అంతరంగిక పవిత్రతగూడా అభివృద్ధి నొందనారంభించును. ఈ నిర్విరామకృషిని మనలక్ష్యముపై (దృఢమగునేకాగ్రతతో) జోడించుట అత్యున్నతమగు పవిత్రతాస్థితిని పొందుటకుపకరించును. ఈ పద్ధతి ఇట్లు ప్రవృత్తమై నిజమగు పరిశుద్ధత మనయందు వ్యాపించి అంతఃశౌచముతోబాటు మనస్సు సహితము నిర్మలమై పవిత్రమగు నూహలను రేకెత్తించి మన పురోగమనమునకు దోహదము చేయును. ఇట్లు మనము రెండు విధములుగ లాభము పొందుచున్నాము. ఉపాసన సాధనలచే అంతరంగిక శుచిత్వమునకు మనము ప్రయత్నము చేయుటచే ఈ బాహ్యశౌచ ప్రక్రియలు దానికి సహాయపడి మన యాదర్శమును సులభముగ పొందుటకు వీలగును. అంతఃశ్శౌచ బహిశ్శౌచములు రెండును అనురూపమగుచో అదియే ఒక శక్తిగా పరిణమించి మన మార్గమును సుకరము చేసి మనము ఉన్నత స్థితికి పోవుటకు సహకారియగును. ఇట్లు పవిత్రతాభావన మన యాదర్శమును పొందుటకు మిగుల నుపయోగపడును.

ఈ మొట్టమొదటి నియమము సంధ్యోపాసనలను సక్రమముగ నభ్యసించు విధానమునకు సంబంధించినది. ఈ నియమపాలనముచే కాలక్రమమున మనము చివరకు పొందవలసిన శక్తిని పొందుటకు మొదలు పెట్టుదుము. ఈ సందర్భమున మరియొక ముఖ్య విషయము చెప్పవలెను. దివ్య శక్తిధార ప్రవహింప మొదలిడినపుడు

దాని మధనమువలన నుద్భవించిన క్రియ ప్రతిక్రియలు (Action and counter action) ఒక విధమగు స్థాల్యస్థితిని సృష్టించెను. దాని నుండి ప్రత్యేక రూపము స్థితిగల అణువులు పరమాణువులు ఏర్పడెను. ఆశక్తి ధారా ప్రవాహబలముచే ఉష్ణము కల్గెను. ఇదియే జీవమునకు మూలమై ఉనికికి (Existance) దోహదమునిచ్చెను. ఆ యుష్ణము అచటనే యున్నను దాని శక్తి అధోగామియయ్యెను. ఊర్ధ్వముఖము అధోముఖము అను పదముల సార్ధక్యమును గ్రహించుట కొంత కష్టమగునేమో! అత్యున్నత స్థితిని గూర్చి మనమూహించినచో మన యూహ దానికి వ్యతిరేకమైన అతి తక్కువస్థితిని సైతము పరిగణించి యుండును. అత్యుత్తమమును అత్యున్నతమును అగు స్థితిలోనున్న పద్వస్తువునందు మనముద్భవించి యుండుటచే ఆస్థితితో పోల్చినచో అది దానికి తరువాత స్థితి- సాధారణముగ దానికంటెను తక్కువస్థితి- యనవచ్చును. ఈ భావనయే మన మనస్సునకు హెచ్చు, తక్కువ అను నభిప్రాయములను గల్గించును. సూక్ష్మాణువుల అధోముఖగమన స్వభావము తగ్గిపోగా వానిలోనికి నిర్విరామముగ ఉష్ణమును ప్రవహింపజేసిన ఆ దివ్యశక్తియే వానిని తమ జన్మస్థానమును చేరుటకై వానిని ఊర్ధ్వగాములుగా చేయును. ఆ చలనముచే జనించిన యుష్ణము వానిని తేలికగా చేయును. తేలికగా నున్న వస్తువెపుడును ఊర్ధ్వముగ లేచు స్వభావముగలదిగదా! అందుచే అది మూలము వైపు పయనించును. ఇట్లు దివ్యశక్తి ప్రవాహబలముచే స్పందించెడి ప్రతి వస్తువును దాని మూలస్థానమునకెగుర నారంభించును. అందుచే మానవునకును ఇదియే ఉన్ముఖత సంక్రమించినది. అందుచే వాని యధోముఖ గమనము నిరోధింపబడినచో వాని హృదయమున తన మూలమును చేరవలెననెడి ఆకాంక్ష సహజముగనే పునఃప్రవృత్తమై వాని మనస్సును ఊర్ధ్వముగ మరల్చును. మనుజుడు సంధ్య, ఉపాసన, ధ్యానముల యెడ నాసక్తుడగుటకిదియే కారణము.

ప్రకృతిజనితమగు నుష్ణమునకును సూర్యుని నుండి వెలువడు ఉష్ణమునకును చాల భేదము కలదు. సత్యతత్త్వమునుండి వెలువడిన తొలి యుష్ణమునకు భౌతిక సంసర్గములేదు. కాని భౌతికమగు సూర్యుని వలన జనించిన యుష్ణమును ప్రకృతిజనితమగు నుష్ణముతో పోల్చిన చో మొదటిది స్థూలతరము. ఈరెండు ఉష్ణములమధ్య భూమ్యాకాశముల మధ్య నున్నంత యంతరము గలదు. సూర్యుని యందలి యుష్ణము ప్రత్యక్షముగ కనబడుచున్నది. కాని శక్తియందలి ఉష్ణశక్తి నిద్రాణమై యున్నది. 'తాప' శబ్దము రెంటి యందును సమానమే. సూర్యుని యుష్ణము వెచ్చదనమునేయిచ్చును. కాని ప్రకృతిజనితోష్ణము

ప్రాణప్రవర్తకమై దానిని కాపాడును. ఇదియే ప్రాణశక్తి. ఇట్టి సూక్ష్మవిషయములను విపులముగ చర్చించుటకు దగిన మాటలు లేవు. అట్టి చర్చ అసంభవము. వీలగునంతవరకు దానిని మాటలచే నిర్వచించుటకు బ్రయత్నము చేసినను వాని మధ్యగల భేదము వ్యక్తిగతమగు ననుబవముపై నాధారపడియుండు. సహజమార్గమనబడు ఈ యాధ్యాత్మిక శిక్షణా విధానములో తొలుదొల్తనే అభ్యాసి మనస్సుయొక్క అదోముఖ గమన స్వభావమును గురువు తన స్వశక్తిచే బలహీనపరచి అది సహజముగనే దైవాభిముఖమగునట్లు చేయును. ఈ మానసిక స్థితి ఉన్నత చైతన్యభూమికకు చెందినది కాగా రెండవది నిమ్నభూమికకు చెందియుండును. ఈ మార్గమున ఆధ్యాత్మిక శిక్షణనిచ్చు మూలసూత్రము వేదాంతులకు విచారణీయము. 'చైనా దేశపు వేదాంతియగు సఖాన్‌కుగల విజ్ఞానము అలంకారయుత వాక్చాతుర్యమును మనుజుడు పొందగలడేమో గాని సర్వశక్తియుతుడగు పరమేశ్వరునిగూర్చిన విజ్ఞానమును పొందజాలడు' అని యొక కవి పల్కియున్నాడు. ఈ సందర్భమున నొక గొప్ప సాదుసత్తముని పల్కుల నిందు పొందుపరచెదను. 'భగవంతుడు సాదకుని ప్రతి ప్రశ్నకును సమాధానము వచ్చునట్టి ద్వారములను బంధించినాడు'. ఆ ద్వారమేమియని ఆలోచించినచో తెలియును. అట్టి పరమేశ్వరుని మన దృష్టినుండి మరుగుపరచు తెర ఏదియో, అది ప్రగాఢమగు భావనచేతనే గోచరించును. భగవత్తత్త్వమును గూర్చి మనము భావించునపుడు మన భావనాశక్తియే ఆ తత్త్వముచుట్టును ఒక వలయమును కల్పించును. సత్పదార్థమును గురించిన జ్ఞానము మనకు గలుగనీయక ఆటంకపరచునది ఈ వలయమే. ప్రతిప్రశ్నకును కావలసిన సమాధానమునకు అడ్డువచ్చునది ఈ గ్రంథియే. ఈ గ్రంథిని మనమతిక్రమించి భావనా పరిదిని దాటగల్గినచో మిగుల సూక్ష్మ విషయములు సైతము మనకు విశదముగ గోచరించును. కాని ఈ వలయము దీనిలోపల నున్న మరియొక వలయము యొక్క ప్రతిబింబమే. దీనిలోనికి మనము బలవంతముగ ప్రవేశింపగల్గినచో మూల రహస్యము మనకు గోచరమగును. కాని ఈ యవధులను భేదించుట వ్యక్తిగత సూక్ష్మాణువులను భేదించుకొనిన వానికే సాధ్యము. కాని ఇది చాల నరుదు. ఏలనన ఇట్టి సాదనసంపద చాల అరుదగు వాని విషయమునదప్ప అనుష్ఠానమునకు రాజాలదు. అయినను తన యిచ్ఛాశక్తిచే ఈ పరమాణువులను భేధింపగలిగిన సమర్థుడుద్భవించినచో ఈ వలయమదృశ్యమై ఛిన్నాభిన్నమైన దృష్టి దృశ్యముతో ఏకమగుచున్నది. అట్టి విజ్ఞానము గలిగియుండుటకు అతడు ఆ సూక్ష్మాణువులను వాని ప్రథమ స్థితిలో నుండునట్లుగా సందానముచేయు శక్తిగలవాడై యుండవలెను. అట్టి వ్యక్తి ఎపుడైనను పుట్టియుండెననుట సామాన్యులకు ఊహాతీతము. కాని అట్టివ్యక్తులు ఖచ్చితముగ కొందఱుద్భవించియున్నారని నా దృష్టికి

రూఢిగ గోచరించుచున్నది. సూక్ష్మాణు భేదనము తర్వాతనుండెడి స్థితి అవ్యక్త చలనస్థితితో సమానము. అట్టి వాని సంకల్పశక్తిసృష్టికి పూర్వమును, మహాప్రళయము తరువాతను ఎట్లుండునో అట్లే నిగూఢముగ నుండును. సృష్టికి కారణభూతమగు నిగూఢ సంకల్పశక్తియే ఛేదింపబడిన ఈ సూక్ష్మాణువులను మరల సరిచేయును. అపుడు వానికి మధ్య అవది హద్దులేనేలేదు.

# ఆదేశము -2

'భక్తి ప్రేమపూరిత హృదయముతో నీకు అధ్యాత్మికోన్నతిని ప్రసాదింపుమను ప్రార్థనతో నీ పూజను, నీ ధ్యానమును మొదలుపెట్టుము.

భక్తికి చిహ్నము ప్రార్థన. మనము పవిత్రుడగు భగవంతునితో భక్తి సంబంధము నేర్పరచుకొన్నామని అది సూచించును. మనమెవరినైనను దివ్యశక్తి యుతుడగు ప్రభువు అని భావించినంతనే మనమాతని సేవకులమగుదుము. ఇక ఆ ప్రభువును సేవించుటయే సేవకుని పని. భరతుని విషయమును చూడుడు. తన ప్రభువగు శ్రీరామచంద్రునిపై గల భక్తి ప్రపత్తులకు దప్ప వేరొక అభిప్రాయముచే అతని హృదయము కలుషితముగాలేదు. ఆదర్శమగు భక్తికి చిహ్నమగు నీ భరతుని యుదాహరణము మన దృష్టిలో నుండవలెను. ఇదియే భక్తి సంబంధము. ఇట్టి భక్తియే ప్రభువును సేవకునితో ఆదినుండియు అంత్యమువరకు కలుపు గొలుసు.

టెలిగ్రఫీ యందలి సూత్రము మనకు తెలియును ఒక చివర విద్యుచ్ఛక్తితో సంబంధము గల్గియున్నచో అచటి వార్త వెంటనే రెండవచివరకు చేరును. తన స్వశక్తియను విద్యుత్ప్రవాహముతో స్వవిషయమును ప్రభువునకు నివేధించుకొను భక్తుని స్థితియు నిట్టిదే. భక్తి ఫలితముగా ప్రభువునందున్న శక్తి సేవకునిలోనికి బ్రవేశింపనారంభించును. క్రమక్రమముగా ప్రభవుయొక్క సర్వస్వమును సేవకునిలో ప్రవహించును. మొదట భక్తుడు ప్రభువుతో తన స్వవిషయమును నివేదించుకొనును. ఎంత మంచి మాట! భక్తుడు భక్తి నారంభించెను. దాని ఫలమేమనగా స్వామియు వానికి సమీపస్తుడు కాదొడగెను. భక్తి మరింత వృద్ధిచెందెను. అతడెక్కువ ముందుకుపోయెను. ప్రభువుతో సహవాసము చేయవలెననెడి విచారము భక్తునిలో పులకితము గాఁదొడగెను. సహవాసమారంభించెను. ధ్యానము ప్రారంభమాయెను. సమాచారములనందుకొనుట మొదలిడెను. ఆదేశములు రాఁదొడగెను. ప్రాతమిక సంస్కార మారంభమయ్యెను. ఇంతవరకును ఎటులో జరిగెను. ఇకముందేమి జరుగును? ..... ఇదియొక రహస్యము. ఇచట భక్తునకు వాగ్బంధమగును. భక్తి మనలను బంధించినదని ప్రజలందురు. కాని ఇచట విలోమ పరిణామము

మరలవచ్చును. ఎవరైనను ఈ తత్త్వమును గ్రహించినవారు పూర్ణత్వమును పొందినవారగుదురు. మనుజుని యూహాశక్తి ఈ వేదాంత తత్త్వమువరకును పోలేదు. అందుచే ఇప్పటికిని ఈ రహస్యము దుర్భేధ్యమే.

ప్రేమ భక్తిపూరిత హృదయములతో మనము ప్రార్థన చేయవలెనని ఏల చెప్పబడినది. భగవత్కృప మనలో ప్రవేశించుటకు మన హృదయమును శూన్యము చేసికొనుటయే ఇందలి రహస్యము. దేనిచే భగవత్కృపారసధార మనపై నేరుగ పడునంతటి యాకర్షణకలుగునో దానికవకాశము కలుగజేయుటే. "భగవత్కృపారసమును గ్రోలనెంచు పిపాసుడా! నీ హృదయమును ఖాళీచేసికొనుము. ద్రాక్షరసముతో నిండియున్న సీసా ఖాళీ గిన్నెను మాత్రమే నింపగలదు". అని యొక కవి పల్కియున్నాడు. అబ్యాసము క్రమముగ కొనసాగుచో మనుష్యుడు తానెప్పుడును ప్రార్థనయందే నిమగ్నుడైయున్న స్థితిననుభవించును.పైవిధముగ సాదనచేసిన అబ్యాసికి ఈ స్థితియెప్పుడు కలుగునో అపుడే భగవత్కృపారసము అతనివైపు ప్రవహింపమొదలిడును. ఈ స్థితి తుది ఘట్టము చేరినపుడు మనుజుడు ప్రార్థనయందే ఉండనారంభించును. ప్రాపంచిక సంబంధమగు కార్యములు నెరవేర్చుచున్నను అతడాస్థితియందే యుండును. ప్రాపంచిక కార్యములు అతని స్తితికి విఘ్నము కలిగింపజాలవు. 'ప్రపంచ సంబంధములను త్రెంచి కొనుడని నేను మిమ్ములను కోరను. కాని ఏపని చేసినను హృదయపూర్వకమగు భగవచ్చింతనతో ఈశ్వరసాన్నిధ్యమందుండుడు' అని యొక కవి మాట. ఇట్టి మానసిక స్థితిని అలవరుచుకొన్నచో మనుజుడెప్పుడును ప్రార్థనయందే నిమగ్నుడైయుండును. తాను సేవకుడు పరమేశ్వరుడు సేవ్యుడు అని గ్రహించి ఈశ్వరుని ఈశ్వరునిగా అర్థము చేసికొనినచో భక్తి తన స్వస్థానమునకు వచ్చినట్లే. ఏమి! ఇది అందరును పొందగల్గెదరా? తగినంత సాదనచేసిన పిదప ప్రతివ్యక్తియు ఈ స్థితిని పొందగలడు. ఇట్టి స్థితిని పొందినవాడు ప్రార్థనా పరిధిలోనున్నాడు. తనకు గావలసిన దానిని వినయపూర్వకముగా ప్రభువునెదుట విన్నవించుకొనుటకు అతనికధికారము కలదు. స్వేచ్ఛ గలదు. కాబట్టి ప్రార్థనాసమయమున ప్రతి వ్యక్తియు ఇట్టి స్తితిని పొందవలెను. అపుడే ప్రార్థన అంగీకరింపబడును. ఆత్మీయసంబంధమగు ప్రేమను మన హద్దుమేరకు స్థిరపరుచుకొని భగవంతుని హద్దువరకు చేర్చుట జగిరినది. ఒకసారి ఇట్టి సంబందము నెలకొనినచో అది ఇక విచ్ఛిన్నముకాజాలదు. అయినను మన గమ్యము బహుదూరమని అందరును ఎరుగుదురు. కాని మన సంకల్పబలమట్టిదగుటచే మనల నాగమ్యమును సులభముగ చేర్చును. ప్రియుని స్మృతి ప్రియురాలిని అతని సమీపమునకు చేర్చును.

ఈ సామీప్యతకు అవధిలేదు. ప్రేమ అధికమగుకొలది ప్రేమించెడి వ్యక్తి ప్రభువునకు చేరువగును. జగత్పిత తోటి ఈ బాంధవ్యము మనకు పుట్టుకతో వచ్చినదే. పిత్రీయమే. కాని ఈ బాంధవ్యము నభివృద్ధిచేసికొని ఆ జగత్పితకు ఎల్లప్పుడును సన్నిహితులముగానుండునట్లు చేసికొనుట మన కర్తవ్యము. ప్రార్థనా భావము భక్తి భావముతో మిళితమైననే దానికి బలము చేకూరును. ఇదియే గమ్యమును చేర్చుట కొరకేర్పడిన నిచ్చెనలో తొలిమెట్టు. ఈ మెట్లే ఒకదానికొకటి జతయై ఆవలి గట్టునకు చేర్చుటయందు సహాయకారులగును. ఆధ్యాత్మికాభివృద్ధియందలి అన్ని స్థితులును దీనియందున్నవి.

ప్రార్థనకు నియమితమగు సమయములేదు. ప్రార్థన చేయవలెననెడి కోరిక కల్గిన సమయమే అత్యుత్తమ సమయము. అట్టిమానసిక స్థితి కలుగనిచో అవసరమైనపుడెల్లను అట్టి స్థితిని మనము కలిగించుకొనవలెను. సర్వశక్తియుతుడును ప్రభువును అగునాతని, లేక అట్లనుటకు తగిన వానిని గూర్చియే మనము ప్రార్థన చేయవలెను. బానిసలను ప్రార్థించుట సరిగాదని నా యభిప్రాయము. బానిసలనగా మానవుని యధీనమందుంచబడిన శక్తులు. వానికి మనుష్యుని నుండియే శక్తి లభించును. తరువాత కాలప్రభావముచే వాని శక్తి క్షీణించినది. అత్యవసరమును అతి ముఖ్యమునునగు విషయమునందు దప్ప కేవల ప్రాపంచిక లాభములకై ప్రభువును ప్రార్థించుట మూర్ఖత అవివేకము అగును. దైవనిర్ణీతములగు విషయములలో ప్రభువును ప్రార్థించుట మంచిది. ఇది మర్యాద లక్షణము. మరియును మనస్వామిని హృదయపూర్వకముగా మనము నమ్మియున్నామనియు అతనిపై ఆధారపడియున్నామనియు అనుటకు ప్రమాణము.

'ప్రతి వ్యక్తికిని శుభమును కలుగజేయు ప్రార్థన ఎట్లుండవలె?' నునది ఒక ప్రశ్న. దీనికి సమాధానమేమనగా, ప్రార్థనచేయుసమయమున సామాన్యముగ మనసే స్థితియందుడునో ఆ స్థితికి తాను రావలెను. నిజమగు సేవకుడు నమ్రభావముతో తానొక అల్పభిక్షుకునివలె ప్రభువునొద్ద కేగుచున్నానను భావమును హృదయమున కలిగియుండవలెను. అపుడే ఆ ప్రభువు నిచ్ఛకు లోబడి ఆయనకడ తానేది యైనను నివేదించుకొనవలెను. ఆయన యిచ్ఛకు అధీనముగా వలెను. అయనకు సర్వ సమర్పణము చేసికొనిన తరువాత తన నిజరూపము నాతడు ధరించవలెను. అన్నివైపులనుండి సంకోచించుకొని ప్రాపంచిక వాసనలన్నింటిని విడచి అన్ని విషయములనుండి తన మనస్సును మరల్చి దానిని అయనవైపు సంపూర్ణముగ మరల్చ వలెను. అపుడు సంసారము

నిస్సారముగ కనబడవలెను. జ్ఞాపకము తెచ్చుకొను ప్రతి విషయమును పరాత్పరుని జ్ఞాపకముతో మిళితముగావలెను. ఈ స్మరణ ప్రతియణువునందును ప్రతి రోమమునందును స్పందింపవలెను. దీనినే ఆత్మ నిరసనము అనవచ్చును. ఇట్టి స్థితి మానవుడు తనలో అలవరచుకొనినచో అతడు నఖశిఖపర్యంతము ప్రార్థనా రూపమేయని అర్థముచేసికొనవలెనని నా యభిప్రాయము. అట్టి వాని ప్రతి యూహయు భగవంతుని కిష్టమగు నూహయే. ఈశ్వరేచ్ఛకు వ్యతిరిక్తమగు దానిని అతఁడెప్పుడును భావింపడు. అతని మనస్సు ప్రభువునిచ్ఛకనుగుణమగు దానినే కోరును. ఇట్టి ప్రార్థన చేయుటకు మనుజులు నేర్చుకొనవలెను. ఎవడైనను ఇట్టి స్థితిని పొంది దానిలో స్థిరపడినచో ఇకనతడు చేయవలసినదేమి గలదు? ఈశ్వర స్మరణయే. గొప్పయోగులు సైతము ఇట్టి స్థితియొక్క అంచులకైనను చేరలేక తృష్ణతో నిలచిపోయిరనవచ్చును. వారికి ఆకాంక్షయే మిగిలెను. ఇదేమి సామాన్య విషయమా ! దీని ప్రాముఖ్యతను గూర్చి వినిన ఆశ్చర్యపడుదుము. అచట అత్యంత సారళ్యత గలదు. అచట సూక్ష్మప్రకంపనలున్నను దానిని ప్రశాంతత యని కూడ చెప్పనలవిగానంత ప్రశాంతత నిండియుండును. దానిని తీక్షణతయని గాని ఉద్వేగమని గాని అనజాలము. అది వెలగందుమా! ఇదియును సరిగాదు. వెలుగుకానిచో చీకటియందుమా! అదియును సరిగాదు. మరియికనేమి? ఈ స్థితి బహుశః ఎవరికిని నచ్చదు. అది సకల స్థితులకును అంతిమస్థితి. నిజధామము. అద్వితీయ సత్యస్థితి. విశ్వమూలము. ఇంతకన్నను నేనేమిచెప్పెదను?....... ఈశ్వరుడు ఇట్టి స్థితి మీకందరకును సిద్ధించు నవకాశమును అనుగ్రహించుగాక. తథాస్తు.

సృష్టికి పూర్వము అంతటను ప్రశాంతత నెలకొనియుండెను. అట్టి ప్రశాంతత క్రిందికి దిగివచ్చినపుడు దానితోబాటు తన సహజ సత్యసారమును వెంటగొనివచ్చెను. ఈ రెంటియొక్క స్థితి ఇంచుమించుగ ఒకటే. క్రమముగ ఈ సత్యసారమును ఆవరణము తరువాత ఆవరణము ఆవరించెను. ఆ పని చేసినది మనమే. ఆ ప్రశాంతతా ప్రవాహమునందలి యలలు పెద్ద సముద్రమును సృష్టించెను. అనేక నీటిబిందువులు చేరినదిగా నేర్పడెను. వీనికి మూలమేది? సత్యసారమై మనతో వచ్చిన ఆదిబిందువే. పర్వత సానువులనుండి దొరలిన నీటి బిందువులే నదిగా ప్రవహించినవనిన అర్థమేమి? సత్యసారమగు నాబిందువు చుట్టును అనవసరమగు మరికొన్ని నీటిబిందువులు చేరి మూలబిందువును సంపూర్ణముగ నావరించి దాని ప్రతిబింబరూపమును దాల్చదొడగెను. అనగా దానికి స్థూలరూపమును కల్పించినవి. మనమొక వస్తువును చూచినచో దాని స్థూలరూపమే మొదట మన

కంటికగపడును. తదేక దీక్షతో ఆ వస్తువును గమనించినచో ఆ స్థూలరూపముగూడ కరిగిపోవు కాలమువచ్చును. అపుడు దాని యాకారము మాత్రమే నిల్చును. ఇంకను అభ్యాసము చేసినచో ఈ యూహారూపము సైతము అదృశ్యమగును. మరియు ప్రయత్నించినచో సారభూతమగు బిందువును కప్పి పెద్ద చేసిన బిందువులన్నియు అదృశ్యమై చివరకు అసలు బిందువుమాత్రమే మిగులును. ఇదెట్లగును? విశ్వముయొక్క ఉనికికి మూలమగు ఆ సద్బిందువు అనగా ఏ బిందువు మనకు మన భాగముగా లభించినదో దానిపై దృష్టిని నిలిపి ప్రతి పని చేసినచో ఈ స్థితిని పొందుదుము. ఈసద్బిందువుపై నిలిపిన దృష్టియే ప్రార్థనకు చిహ్నమని భావింపవలెను. ఇచట నుండియే మనము బయలుదేరినది.

అనవసరమగు ఆ యావరణలను తొలగించుటయే దీనికి తొలి స్థితి అనవచ్చును. దీనిని అదియని నేనెందులకంటినని జనులాశ్చర్యపడవచ్చును. దేనిని అరంభదశయని యంటిమో అది నిజముగా చైతన్యమందలి ఒక స్థితి. ఎఱుక ప్రతి స్థితియందున్నను ఈ యెఱుక మాత్రము ఉన్నత శ్రేణికి చెందినది. దీనికి తరువాత స్థితులను గూర్చి చర్చింపలేదు. ఏమనగ వాటివరకు దృష్టి సారించుట కష్టము. మరియు దాని చిట్ట చివరి స్థితి ఊహాతీతము. ఆ స్థితిలో ప్రవేశించిన సంపూర్ణ మగునేకత్వము భావింతుము. ఈ స్థితిలో ప్రవేశించుటకు పూర్వమే ప్రార్థన చేయనగును. ఈ మూడు స్థితులను నిజముగ రెండున్నరయని మాత్రమే చెప్పనగును ఏలయనగా దీని తరువాత ఎఱుకయు (awarenes) నుండదు. ఎరుక రెండున్నరవరకే యుండును. మొదటి నుండి చివరవరకుగల అకాశమని మనము గ్రహించుటకొరకు అట్లనుకొనవచ్చును. మధ్యస్థితియు వీనిలో నిమిడియున్నది. అది అని నేనన్నది నిజముగ మనస్స్వస్థలము, నిజధామము. ప్రార్థనలో తొలిమెట్టు అని దీనిని ఒప్పుకొనుట కొంత కష్టమే. కారణమేమి?

ఉన్నత విద్యనభ్యసించు తలపుతోను, ఉన్నతభావములను చర్చించునూహతోను, ఉన్నత సమస్యలను పరిష్కరించు భావముతోను ఒక బాలుడు అక్షరములు నేర్చుకొనుట దీనికి ఉపమానముగా గ్రహింపవచ్చును. ఆ బాలుడు అక్షరములు, పదసముదాయము అను వానిలో చిక్కియున్నను వాని యెదుటనున్న ఆదర్శము ఉన్నతమైనది. అంతిమస్థితితో బోల్చిచూచినచో ఈ తొలిమెట్లు అనవసరము, నిరుపయోగము అని తోచును. ప్రార్థనచేయ మొదలిడు ప్రతి వ్యక్తియందును ఈ మొదటి స్థితియే యుండును. కాని అంతిమస్థితి (గమ్యము) దృష్టియందున్నచో అది స్థూల స్వభావమునుగూడ ప్రభావితము చేయును.

క్రమక్రమముగా అతని దృష్టిలో అంతిమ స్థితి మాత్రమే నిలచియుండి అతడు దానియందే స్థిరపడును. ఇది మొదటి స్థితి. ఎవరు దీనిని ప్రయత్న పూర్వకముగ పొందుదురో వారు దానిని విస్తరింపజేతురు. విస్తరింపజేయుటయన దానిని ఊది బుడగవలె పెద్దది చేయుటయని యర్థముగాదు. నిజమగుశక్తిని దానితో జోడింపవలెను. స్థూల్యత లఘుత్వముగను, లేక సూక్ష్మతగను మారునంతవరకు అది అభివృద్ధియైనచో, ఏదియో సూక్ష్మాతిసూక్ష్మముగ నున్నదను భావనాలేశము గల పరిధిలోనికి బ్రవేశించినట్లు అతడు గ్రహింపవలెను.

మూలమునుండి ప్రవహించిన ప్రవాహములు వివిధమార్గములలో ప్రత్యక్షమై ఈ వస్తుజాలమంతయు దిగివచ్చినవి. అవి నిష్కారణముగా క్రిందికి దిగిరాలేదు. నిర్ణీతమైన ఫలితములను కల్గించుటకై అవి క్రిందికి దిగివచ్చినవి. ఆ శక్తులు అనేక విధములుగ మార్పు చెంది, నిర్దేశింపబడిన ఫలితములను కల్గించుటకై పలువిధములుగ ప్రవర్తింప మొదలిడినవి. ఈ శక్తులన్నియు ఆదిశక్తి నుండి వెలువడి తమ చర్యలను కొనసాగించినవి. ఒక పసిబిడ్డ విషయమును చూతము. పుట్టినపుడు అతడు కదలమెదల లేకుండెను గదా! క్రమ క్రమముగా అతడు కూర్చుండుట, నిలచుట, నడచుట, పరుగెత్తుట నేర్చెను గదా! అనగా, అతనిలో నిద్రాణస్థితియందున్న ఈశక్తులే క్రమముగా ప్రకటితములై మానవుని సంపూర్ణ క్రియాశీలత చివరకు వచ్చినది. ఆ బిడ్డ జన్మ సమయమున అణచిపెట్టబడిన వస్తువు ఇపుడు పెరిగి పరిపక్వమై వేరొక రూపము దాల్చినది. ఆ పసివాని జన్మమునకు కారణమైన బిందువు సూక్ష్మముగా నున్నను, అతని సర్వతోముఖాభివృద్ధికి కావలసిన మూలపదార్థములన్నియు దాని యందే ఇమిడి యుండినవి. తల్లి యలవాట్లు, తండ్రి యూహలు, విద్య, పరిసర ప్రభావములు, తెరల రూపమున దానిని చుట్టియుండి స్థిరపడినవి. ఆ ప్రభావములు తమ పని చేయసాగినవి. ఈ ప్రభావములన్నియు స్వయముగా తమ తమ క్రియలనారంభించి పై పరిణామములేర్పడెను. ఇట్లు నిర్మింపబడిన వస్తువులుగూడ తమ క్రియలనారంభించెను. అతడీ విధముగ స్థూల్యమును చెందులోపల జరిగిన పలు విధములగు మార్పుల సంఖ్య అధికమగుటచే తనలో సంభవించిన మార్పులను అతడేవిధముగ పొందినది అతనికి తెలియదు. ఇపుడాతని స్థూల్యము, దానినుండి వెలువడుటకై అతడు చేసెడి ప్రయత్నములను సైతము ప్రతిఘటించునంత స్థిరపడినది.

ఇపుడు అతనియందు నిద్రాణమై యుండిన శక్తులు వేరొక మలుపు తిరిగినవి. అతడు తన చుట్టునుగల ప్రపంచమును చూచెను. ఇతరుల తోడి సంబంధముచే ప్రభావితుడయ్యెను. పరిసరములుగూడ అతనిని ప్రభావితుని జేసెను. కోర్కెలాతని నాకర్షించినవి. ఇట్లు అతని యునికి సర్వమును మారి అతడు మారురూపము దాల్చెను. పుష్పమందలి రంగుల రూపమున వచ్చిన ఈ విషయములు తన పరిసరముల కనుగుణముగ పదార్థసేకరణము నతడారంభించెను. వానికి మరియు మెఱుగుపెట్టబడినది. మొదట అతని స్థితియేమి? అతడెట్లుమారెను! ఆలోచించుడు. అతని జన్మమునకు మూలమగు సూక్ష్మబిందువు తన స్వరూపము ఏమియు కనబడనంతగా అణచివేయబడెను. ఇంతియేగాదు. అతని భావనాశక్తి ప్రభావముచే అతనిలో బ్రవేశించిన స్వభావములు బలవత్తరములయ్యెను. వాని ప్రవృత్తి మిగుల బలవత్తరమై ప్రకృతి శక్తులనుండి అవి ఎక్కువ శక్తిని గ్రహింపసాగెను. కొన్ని నీటిబిందువులచే ఏర్పడినచిన్నకాలువ పర్వతశిఖరమునుండి క్రిందికి దొరలుచు చిన్న వాగుగామారి, కరిగిన మంచు మరియు చిన్నచిన్న వాగులు కలియుటచే ఎట్లు మహానదిగా పరిణమించునో అట్లే పసిబిడ్డయు ప్రారంభ దశలో తనలో నిగూఢముగనున్న శక్తులు అభివృద్ధియై పరిపక్వమునొందుటచే అదేవిధముగ పరిణామము చెందును. ఆ బిడ్డ తన సంపూర్ణ రూపమును పొందుటకు కారణభూతములైన కర్మలఫలితమే అనీటిలోనగుపడు చిన్ని యలలకు మూలము. ఇవియే కడపట సంతోషపుటూర్ములనబడును. కాని వానినే ఆనందమని అపార్థము చేసికొందురు. ఇట్టి దశ మానవ జీవితములో అతడు సంపూర్ణముగ మాలిన్యములచే గప్పబడియు వికసించిన యౌవన దశలో కల్గును. తానొనర్చిన కర్మల ఫలితముగా మానవుడీరూపముతో వచ్చినపుడు అతనిస్థితి మహాసముద్ర స్థితివలెనుండెను.

ఈ సందర్భమున నొక ముఖ్య విషయము చెప్పవలెను. ఏ వస్తువునైనను తదేక దృష్టితో చూచినచో అది క్రమముగా సమసిపోయినట్లు తోచి దాని ప్రతిబింబము మాత్రము మిగులును. చివరకు ఇదియు అదృశ్యమగును. దీనికి కారణమేమనగా భౌతికమగు వస్తువు భౌతికాకారమును మాత్రమే చూచుటకు శక్తి కలిగియున్నది. దాని కావల చూచుశక్తి దానికావలనున్న సున్నితమగు శక్తికే సాధ్యమగును. ఈ ప్రక్రియ చూచునట్టి శక్తి అదృశ్యమగువరకు సాగును. అయినను దానికావలనేదియో ఊహామాత్ర చైతన్య స్వరూపముతో నిల్చును. ఇంకను ముందుకు పోయినచో ఇదియును అదృష్యమై ఉనికియొక్క భావము సైతము అదృశ్యమగును. కడపట మిగులునది ఏదియు లేనిస్థితి. అదే సద్వస్తువు. ఈ కేంద్రమునుచేరి ఆ స్థితిలో లీనమైనగాని ఈ యనుభూతిని గ్రహించుట, వర్ణించుట, సాధ్యముగాదు. కాని 'ఏదియులేదు' అని చెప్పుటయు ఒక స్థితియే. కానిచో దానినట్లు వర్ణించుట ఎందులకు? ఇంకను ముందుకు పోయినచో?..........

· మూలమునుండి వెలువడిన ప్రవాహములు దట్టముగను స్థూలముగను అగును. ఎందువలన? దీనిని వివరించుట మిగుల కష్టమగు విషయము. అత్యున్నత స్థానమునుండి క్రిందికి దూకిన వ్యక్తి మార్గమధ్యముననే సగము చచ్చినట్లగును. దీనికి భూమ్యాకర్షణ శక్తి కారణమందురు. కాని తాను క్రింద పడుచున్నానను (భావము) ఎఱుక చే జనించిన యుష్ణశక్తి ప్రాణశక్తిని అధోముఖముగా మరలించును. అందుచే ఆశక్తి ఆ త్రోపుడువలన వెలుపలికి వచ్చును. అధోముఖ ప్రవాహములకు ఇదియే స్థితి. ఘనత్వము స్థూల్యమును సూచించును. కాని దానిలో జీవములేదు. దివ్యశక్తి ప్రవాహములు సజీవములు కావు అనుమాట మనకు సామాన్యముగా నచ్చదు. కాని పరమేశ్వరుని నుండి యుద్భవించినను ఖనిజ వృక్షలతాదులన్నియు జీవముగలవియే యని చెప్పనలవిగాదు. వాని యన్నిటయందును జీవమున్నను అది అతి నిగూఢస్థితిలో నుండియుండవచ్చును. దివ్యశక్తి ప్రవాహములు గూడ ఈ రీతిగనే యుండును. కాని మనుష్యుడు గూడ స్వకర్మ ఫలితమున వానితో సంబంధ మేర్పరుచుకొని వానిచే బద్ధుడగుచున్నాడు.

మనకు ప్రార్థన అత్యవసరమని అంగీకరించితిమిగదా! అది యెట్లు చేయవలెనో తెలిసికొనుట అవసరము. అభ్యాసికి ఈ చిన్న ప్రార్థన తగినదని నా యభిప్రాయము.

'ప్రభూ! నీవే మానవ జీవమునకు గమ్యము.
మా ఆధ్యాత్మికోన్నతికి మా కోర్కెలు ప్రతిబంధకములు
నీవే మా ఏకైక స్వామివి, ఇష్టదైవమువు
నీ సహాయము లేనిదే నిన్ను పొందుట అసంభవము.'

ప్రపంచము ప్రస్తుత రూపములో నుద్భవించినపుడు కేంద్రశక్తి అన్ని ప్రాణుల అంతరాంతరములలో నెలకొనియుండెను. ఇది పరాశక్తి యొక్క అంశమే గావున మన దృష్టిని కేంద్రమువైపునకే మరల్చును. ప్రార్థన చేయునపుడు మానసికముగా మనమా కేంద్రబిందువును చేరుటకు ప్రయత్నింతుము. అట్టి స్థితిని మనలో సృష్టించుకున్నపుడే అది సులభమగును. దీనికి అభ్యాసము అవసరము. అత్యంత సరళమును ప్రశాంతమునునగు ఈశ్వర సంకల్పమునకు ప్రపన్నులమైనచో అట్టి స్థితిని పొందవచ్చును. ఇది స్థూల దృష్టికి మిగుల కష్టమని తోచినను వాస్తవమునకు అట్లుగాదు. అట్టి స్థితిని భావనా పూర్వకముగ నాకాంక్షించు వారికి మాత్రము ఇది సులభమే. అద్వితీయ వస్తువునెడ నాకాంక్ష గలిగినచో మనుజుడు ప్రార్థనా స్థితిలోనున్నట్లే. ఇది అందరును ప్రయత్నపూర్వకముగ సాధింపదగినది. ఒక క్షణమైనను అట్టి స్థితిలో మనుజుడు నిలువగలిగినచో అతని ప్రార్థన అంగీకరింపబడినట్లే. నిరంతర సాదనచే నిది నెరవేరును. దీనిని ప్రతిదినమును అభ్యాసము చేయుట అత్యవసరము.

# ఆదేశము - 3

'భగవంతునితో సంపూర్ణమగు నైక్యతను (లయావస్థను) నీ గమ్యముగ నిర్ణయించుకొనుము. ఆ గమ్యమును పొందువరకును విశ్రమింపకుము.

మనయాలోచన, మన సంకల్పము మన గమ్యమునకు మార్గమును సుకరము చేయునట్లు ప్రతి వ్యక్తియు తొలుదొల్తనే తన గమ్యమును నిర్ణయించుకొని దానిపై తన మనస్సును కేంద్రీకరించుట అత్యవసరము. పరమగమ్యము నిర్ణయించుకొనక ఆధ్యాత్మిక మార్గమున పయనించువాడు గమ్యమున కీవలనే నిలచి యుండును. ఏలయనగా గమ్యమును చేరుటకు ముందే మార్గ మధ్యమున ననుభూతములగు స్థితులలో నేయొకటియో అంతిమస్థానమనియు లేక అదియే తన పరమగమ్యమనియు యెంచి అతడచటనే నిలచిపోవును. లక్ష్యనిర్ణయము లేకపోవుటచే కలుగుబాధ ఇదియే. ప్రాపంచిక విషయములలో సైతము కార్యమును నిర్దేశించుకొనకయే చేయు ప్రయత్నములు విజయవంతములగుటకు కావలసినంత తీవ్రముగ నుండవు. చుక్కాని లేని పడవ గమ్యస్థానమును చేరజాలదు గదా! మనుజుని జీవితనౌక ఆధ్యాత్మిక సాగరమున ప్రయాణము చేయుచున్నట్లు భావించినచో ప్రయాణము విజయవంతముగ సాగుటకు చుక్కాని ఎంతయు నవసరము. ఆధ్యాత్మిక మార్గమున గమ్యము చేరుటకు సహాయపడునది మన దృఢనిశ్చయమను చుక్కానియే. మార్గమధ్యముననెన్నియో సుడిగుండములుండవచ్చును. కాని మన సంకల్పబలము, దృఢ విశ్వాసము, ఈ యాటంకములనధిగమించి నేరుగా గమ్యమును చేరుటకు మనకు సహాయపడును. మన దృష్టి ఆధ్యాత్మిక జీవనముపై కేంద్రీకరింపబడియుండుటచే మనము అత్యున్నతమును పరమేశ్వరునితో ప్రత్యక్ష సంబంధము గలిగినట్టిదియునగు ఆదర్శమునే గైకొందుము. ఈ విధముగా ఆద్యంతరహితమగు ఆ కేవల పరతత్త్వమును చేరుటయే మానవుని ప్రథమ కర్తవ్యము. కాని గమ్యనిర్ణయము సక్రమమైనది కానిచో, ప్రయాణము సక్రమముగా సాగుట, విజయవంతమగుట కష్టము. తన భక్తుని యొక్కహృదయపూర్వక సంకల్పమును గూర్చిన విశ్వాసముభగవంతునకు గలిగినచో, అతని దివ్య సహాయము తప్పక కల్గును. సందేహములేదు. భక్తునియొక్క ప్రతి చర్యవలనను అనంతుడగు పరమాత్మయందు

స్పందనమేర్పడినచో, భక్తుడు తన భావమును పరమేశ్వరునిపై కేంద్రీకరించినాడని గురుతు. ఇది ప్రేమికుల దృష్టాంతమును మనకు జ్ఞప్తికి తెచ్చుచున్నది. ఇందుచే భక్తునకును భగవంతునకును మధ్యగల దూరము తగ్గిపోయి, తాను భగవంతునకు దూరముగ నున్నాననను భావము మాసిపోవుటకారంభించును. ఆ సామీప్యతా భావము క్రమక్రమముగ వృద్ధియగుటచే, అతడు సత్యతత్త్వములో లీనమగుట సంభవించును. అపుడు దూరముగనున్నానను భావము నశించి సృష్టిసమయమున మూలమునందు గల్గిన అవ్యక్త చలన రూపమును ధరించును. ఈ విధముగా ఆ విలీనస్థితి శాశ్వతము, స్థిరమునునగు అనంత సాగరమునందు మనము తేలియాడు స్థితిగా పరిణమించును. మనము ఈదులాడుచున్న సాగరమునందలి యలల ప్రభావము మనకు సత్యజీవనమును ప్రసాధించును. మన వజ్ర సంకల్పమే మన గమ్యమును చేరుటకు సహాయపడెనని ఇపుడు నిశ్చయమగును. చరమస్థితిలో మనము ధృఢముగా నిలచియుండుటయే దీని ఫలితము. సరియగు గమ్య నిర్ణయము, ధృఢసంకల్పము వలన ఈ క్లిష్టసమస్య ఎంత సులభముగ పరిష్కరింపబడెనో గ్రహించుట మనకు కష్టము గాదు. గమ్యమును చేరవలెననెడి మన సత్సంకల్పశక్తియే మన ప్రయత్నములను ఉత్సాహపూరితములుగా జేసెను. మన యాదర్శము గంభీరమును, ఉదాత్తమును అగుటచే దానియందభిరుచి అభివృద్ధియై చివరకది అకాంక్షగా పరిణమించెను. అపుడు మనము దానిని చేరుట కొరకు అతురపడుచుంటిమి. ఇట్టి స్థితి యలవడినచో మానసిక ప్రవృత్తులు శక్తివంతములై దైవీ మార్గము వైపునకే మ్రొగ్గును. సృష్టిసమయమున ఈశ్వరునియందు నిద్రాణమైయున్న శక్తి చలన (క్షోభ) రూపమున ఎట్లు బలవంతముగ మార్గము నేర్పరచుకొనెనో అట్లే మన గమ్యమును చేరుటకు మనలో రేకెత్తిన ప్రగాఢ వాంఛ తీవ్రమగు నశాంతి, తీవ్రమగు నాకాంక్షగా బరిణమించి మనలో నెలకొన్నచో అదియే గమ్యము వైపునకు మన మార్గమును బలవంతముగ తెరచునని నిశ్చయింపవచ్చును.

# ఆదేశము - 4

'ప్రకృతితో తాదాత్మ్యమును చెంది దానితో మిలితమగు నట్లు నిష్కపటముగను నిరాడంబరముగను జీవింపుము.,

ఈ యాదేశము నందలి విషయము విశధీకరించుట కొంత కష్టము. నిరాడంబరత ప్రకృతికి ప్రాణము. పరతత్త్వమందలి అవ్యక్త శక్తియొక్క ప్రతిబింబమే ఇది. ఇదిచలనమునకు పెరుగుదలకు దోహద మొసగును. పరతత్త్వముయొక్క సారము, అత్మ ఇదియేనని చెప్పుట సముచితము. వాస్తవముగ దీనినుండియే క్రియాశక్తి ఉత్పన్నమగును. ఇదియే కేవలసత్యము. సర్వమూలము. దీని తర్వాత వచ్చునదంతయు మాయావలయము. సాధారణముగ దీనియందే మనుజులు చిక్కుపడి వారి క్రియాకలాపములను చేయుచుందురు. వస్తువుల రూపకల్పనకు, ఈ విశ్వమారంభమగుటకు ఇదియే హేతువన దగును. మనుజునిలో గూడ ఇది యభివృద్ధినంది బలిష్ఠమగు గ్రంథుల రూపమున బరిణమించినది. ఈ గ్రంథులను విశేషమగు సంకల్పబలముచే మాత్రమే భేదింప వీలగును. ఈ గ్రంథి వలయములందు జిక్కి ఉపరితలమునందే స్థూల్యము *(Grossness)* ప్రతిబింబించునట్టి రూపమును మనుష్యడు ధరించుచున్నాడు. బాహ్యావాతావరణము, పరిసరములుగూడ దీనిపై తమ ప్రభావమును చూపును. ఈ ప్రభావమువలన నుద్భవించిన క్రియ ప్రతిక్రియల *(Actions and Reactions)* ఫలితముచే ఇది మిగుల చెడ్డదిగ మారును. ప్రకృతి సారమును, పరతత్త్వపు నిగూఢశక్తియొక్క ప్రతిబింబమునునగు ఈ నిరాడంబరత పరిసర ప్రభావముచే గప్పబడి దాగియుండును. ఇవన్నియు కలసి ఒక వల వలె నేర్పడగా మనుజుడు దానిలో స్వయముగ చిక్కుబడిపోవును.

సృష్టికి పూర్వము సంపూర్ణమగు ప్రశాంతతయే యుండెను. క్షోభకల్గెను. దాని పరిణామమువలన బ్రహ్మాండములును, వాటిని సుస్థితిలో నుంచెడి శక్తులును అభివ్యక్త మయ్యెను. సృష్టి ప్రకటిత మాయెను. సృష్టించబడిన సకలవస్తువులును మూలశక్తియొక్క ప్రతి బింబమును గ్రహించెను. దివ్యశక్తి యొక్క అంశరూపమును తమతో తెచ్చుకొనినందున వాని చర్యలు మూలవస్తువుయొక్క క్రియయో ప్రతిక్రియయో యైయుండెను. ఇట్లు ఒక సాలీడువల రూపొందనారంభించినది. ఈవల నిర్మాణమునందలి ప్రతి సూక్ష్మాణువును తన

నవేమ్మళనములో ఈ శక్తిని గలిగియుండి అది తన మూలమును చేరు సమయమాసన్నమగువరకు అట్లే యుండును. మనుష్యుడు సృష్టించబడినపుడు అతని స్థితి ప్రచ్ఛన్నమై నిద్రాణముగ నుండెను. అతడు తన వెంట గొనివచ్చిన ప్రచ్ఛన్న మూలపదార్థము లింకను వ్యక్తముగాలేదు. క్రమముగా వానికి సంక్రమించిన శక్తులు వికాసముజెంద నారంభించెను. తొలిక్షోభకు గారణమగు ఈశ్వరుని ఇచ్ఛాశక్తి మనుజునిలో గూడ నుండుటచే అది దాని పరిమాణ ననుసరించి వ్యక్తముకాసాగెను. అది దైవీశక్తి చర్యలను బోలిన చర్యలను ప్రదర్శింపసాగెను కాని దైవసంకల్పశక్తి అధోముఖముగ ప్రసరించుటచే మనుజుని సంకల్పశక్తి దానికి భిన్నప్రవృత్తితో తన స్వంత సృష్టిని చేయసాగెను. అతడు విభిన్న మార్గము ననుసరించుటచే అతని చర్యలన్నియు ప్రకృతి చర్యలకు వ్యతిరేకముగ నుండెను. ఈ రెండు విధములగు చర్యలు (దైవ, మానవచర్యలు) సమానములే యైనను, మానవుని చర్యలచే గల్పింపబడిన వ్యక్తిగత వలయము పవిత్రత స్వచ్ఛతల విషయమున దైవచర్యచే గల్పింపబడిన వానికి వ్యతిరేకముగనుండెను. భగవత్సృష్టి భగవదేచ్ఛా కల్పితసమయము ముగిసినంతనే ముగియును. కాని మానవుని స్వయంకల్పిత సృష్టివలయము అతడు తన యూహాకల్పిత కంపనా ప్రభావమును నాశము చేసికొనిననేగాని ముగియదు. మానవుని భావనాకంపనములు దివ్యసంకల్ప కంపనముల కంటెను వ్యతిరేకముగ నుండుటచే ఆ కంపనలయొక్క సహజ స్థూల్యత మనుజునిలో సైతము ప్రవేశించెను. భగవత్కల్పిత కంపనములు సహజముగ నిర్మలములును, సూక్ష్మములును అగుటచే అవి వాని సహజస్వభావమును నిల్పుకొనగల్గెను. కాని మానవ సంకల్ప కంపనములు వక్రగతిగలవయ్యెను. ఇదియే వానియందలి భేదము.

పరమేశ్వరుని యందుగల సర్వశక్తులును మనుజునియందును గలవు. తొలి క్షోభ సమయమున వెలువడిన సూక్ష్మాణు సముదాయము అతని సంకల్పశక్తి యందును ఉండుటయే దీనికి కారణము. కాని వానిది వ్యతిరేక వైఖరియగుటచే వాని చర్యలును వ్యతిరేక మార్గమున బరిణమించి పరావృత్తిమార్గమున వినియోగింపబడజొచ్చెను. ఇవన్నియు గలసి కొన్ని చిక్కులను సృష్టించెను. వానియందలి ప్రతిసూక్ష్మాణువును భగవంతుని సువ్యక్త సృష్ట ప్రకాశమువలె మిగుల బలవంతమును శక్తివంతమును నయ్యెను. ఈ విధముగ మనుజుడు స్వయముగా ఒక చిన్న సృష్టిని గావించెను. అతని శక్తులన్నియు ఈ విధముగ ఉజ్జీవనము లగుటచే బలసంపన్నులై మొండి పట్టుదల గలవయ్యెను. అతని మనస్సు

భావనలు వానితో సహకరింప మొదలిడెను. దీని ఫలితమే భావనా ప్రపంచ సృష్టి.

అరుబయట విహరింపుమని ఒక ప్రవృత్తి అతనిని ప్రోత్సహించును. మరియొక ప్రవృత్తి దానిని వారించును. ఒకటి ధనమునార్జింపుమనియు, మరొకటి ఉద్యోగము సంపాదింపుమనియు కోరును. ఈ కష్టమెందుకు? ఒక ధనవంతుని యండజేరి వానిని తృప్తిపరచినచో ధనములభించునని ఒకటి తెల్పును. మరొకటి వివాహమాడి సంతానవంతుడు గానిచో ఈ ధనము నిరర్థకమని తెల్పును. చివరకతడు వివాహమాడి సంతానవంతుడగును. బిడ్డలు పెద్దవారగుకొలది వారిని విద్యావంతులుగా జేయు సమస్య ఎదురౌను.

ఇపుడతనికి నాటకము జూడగోరికగల్గెను. ఒక నాటకమందిరమున 'జమీలా' మంచి యభినయము చేయుచున్నది. దానిని చూడుగోరిక గలినగెను. అతడచటకేగి ఆ వినోదమును నాలుగైదు మార్లు చూచెను. 'జమీలా' యొక్క సోయగము వయ్యారములు ఆ నాటకమును మరల మరల చూచుటకు అతనిని ప్రోత్సహించెను. ఆమె వాల్చూపులు ఒయ్యారములు అతని ఇంద్రియముల కుద్వేగము గలిగించెను. ఆమెను గూర్చిన ప్రతి విషయము అతని నాకర్షించును. ఇది ప్రేమగా పరిణమించును. అతనికి ప్రపంచమంతయు తన్మయముగా గనబడును. ఆమెకొరకు ధనము వెచ్చించదలచును. కాని సన్మార్గమున ధనము సంపాదించుట కవకాశము లేక అతడు చెడ్డ త్రోవలు త్రొక్కును. ధనముకొరకు దొంగతనముచేయును. అతని మొదటి స్థితియేమి! ప్రస్తుత స్థితియేమి! అతడు తన భావనా వలయమున జిక్కి ఈ విధమయ్యెను. ఇదే విధముగ మరికొన్ని సంఘటనలు మరికొన్ని చిక్కులను గల్పించి ఈ వలయమును దృఢతరమొనర్చును. వాని యందలి స్థౌల్యత అభివృద్ధియగును. తత్ఫలితముగా అతడు భోగ లాలసత, కోపము, కామేచ్ఛ మొదలగు వానికి దాసుడగును. అతనిలో దుష్ట ప్రవృత్తుల సమ్మేళన మేర్పడును. ఇంతకు పూర్వమతడు అనుసరించిన మార్గమును క్రమముగా వదలి మనస్సును సన్మార్గముపై కేంద్రీకరించినచో పై విషవలయములనుండి అతడు వెనుకకు మరలగలడు.

ఈ విధముగ మనస్సును వెనుకకు మరల్చుట సామాన్య మానవుని శక్తికిమించిన పని. అందుచేనతడు అత్యున్నతమగు నాధ్యాత్మిక స్థితిలోనుండి పతన భయములేని మహాపురుషుని యండ జేరవలెను. అట్లు చేరి శ్రద్ధాభక్తులతో అయనను సేవించి అయన సాన్నిధ్య ప్రభావముచే అధోముఖగాములగు తన మనః ప్రవృత్తులను ఊర్ధ్వ ముఖముగా మరల్చుకొనవచ్చును. దైవానుగ్రహముచే గలుగు ఇట్టి మహాపురుష సాన్నిధ్యము అతని

చిత్త వైకల్యమును మాన్పగలదు.

ఇందులకు పురుష ప్రయత్నమును అవసరము. అతడు తన చుట్టునుగల మోహవలయమును భేదించుట కనుకూలముగ తన యలవాట్లను మార్చుకొనవలెను. ఎట్లనగా చెవులు మంచివిషయములనే వినునట్లును, కనులు మంచి దృశ్యములనే చూచునట్లును, హృదయము సద్విషయముల పైకి మాత్రమే పోవునట్లును ప్రయత్నించవలెను. ఇట్లెన్నియో చేయవచ్చును. కాని ఈ ప్రయత్నములు హృదయపూర్వకముగ నుండవలెను. ప్రతి ఘట్టమునందును దీనికి ధ్యాన సాధనలు గలవు. కాని అభ్యాసికి దృఢసంకల్పము విశ్వాసము అత్యవసరము. వివిధములగు చక్రముల వద్ద వివిధములగు గ్రంథులు గలవు. మరికొన్ని క్రొత్త గ్రంథులును ఏర్పడునవకాశముగలదు. ఈ గ్రంథుల భేదనమునకు తనయందలి గ్రంథులను స్వయముగ భేదించుకొనిన మహాపురుషుని అండదండలు అత్యవసరము. అందుచే ఈ విషయములను తీవ్రముగ నాలోచించి అభ్యసించుటకొరకై వీనిని విశద పరచితిని. సాధకులు తాము స్వయముగా కల్పించుకొన్న విషవలయమును భేదించుకొని ప్రకృతి సారమగునా నిగూఢ శక్తిని మరల తమ సొంతము చేసికొన బ్రయత్నింతురని విన్నవించుచున్నాను. ప్రతి వారికిని ప్రత్యక్షముగనున్న ప్రకృతి యొక్క నిరాడంబరతను ఆదర్శముగా తీసికొని, ప్రాతవాసనలు నశించినదేదియో దానితో తాదాత్మ్యమునొంది సకలేంద్రియములను దానిలో లీనమొనర్చి గమ్యమును చేరుటకు బ్రయత్నించవలెను. అపుడు మాత్రమే పరమేశ్వరుని వైపు నిజముగా మనము పయనించుచున్నామని తలపనగును.

స్వకల్పిత భావనా వలయమును భేదించి చివరకు పొందవలసిన పరిశుద్ధ స్థితిని పొందుటకై తనలోనున్న సకల దుర్విషయములను త్యజించి, సమర్థుడగు గురుదేవుని పాదపద్మముల నాశ్రయించుటయే సన్మార్గము. అద్యంతములులేని ఆనందసాగరమున నోలలాడుచున్న అట్టి మహాపురుషుడే మనలనుద్ధరించి గమ్యమును చేర్చుటకు సమర్థుడు.

# ఆదేశము - 5

'ఎల్లప్పుడును సత్యమునే వచింపుము. ఆపదలు నీ శ్రేయస్సుకొరకు భగవంతుని నుండి వచ్చిన వరములుగ భావించి ఆయనకు కృతజ్ఞతా పూర్వకముగ ధన్యవాదములర్పింపుము.'

సత్య సంధతయనగా తన విషయమై ఉన్నది ఉన్నట్లు కనబరచుట. ఈ స్థితియందున్న మనుష్యుడు అప్రయత్నముగనే (జోహై సోహై) 'ఏది కలదో అదియే యున్నది' అనును. ఈస్థితిని వర్ణించుటకు మాటలు చాలవు. నిజముగ ఇదియే సత్యస్థితి. ఇదియొక స్థితియని పలుకుట దాని నిజస్వభావమును కళంకపరచుటయే. అందుచే దానిని స్థితియనుటయు సమంజసముగాదు. ఇది నిజముగా ప్రళయసమయమున సర్వశక్తులును లయించి కేవల సత్తామాత్రముగ నిలచియుండెడి బిందువు. అపుడు మిగిలియుండునది కేవల సత్పదార్థము మాత్రమే. నాచే ప్రయోగింపబడిన 'సత్య' శబ్దము దాని నిజస్వరూపమును విశదీకరింపదు. ఏలయనగా అచట అన్ని భావములు, జ్ఞానము లయమొందును. దీనిని శక్తి యన్నచో దానికి భౌతికాచ్ఛాదనమును కల్పించి నట్లగును. అందుచే దీనిని వివరించి చెప్పుటెట్లు? చెప్పుటయు నిరర్థకము. దీనిని శూన్యతయనినను దేనియొక్కయో అస్పష్ట ప్రతిబింబమైనను లీలగానున్నట్లగును. ఇకనేమి తెల్పగలను? అందుచే దీనిని 'సత్' అనుటయే సమంజసము. కాని దానిపై మనసు కేంద్రీకరించినచో ఏదియో యొకటి అస్పష్టముగనున్నట్లు భావన నిలచియే యుండును. ఇట్లు అదియే భౌతిక భావన ప్రవృత్తమగును. ఈ రెండు భావములను గూడ మనసుచే నిరాకరించినచో దాని మూలమునందేదియో సూక్ష్మముగానున్నట్లు తోచును. అది ఏదియో ఇదమిత్థముగ చెప్పజాలము. అందుచే 'ఏది కలదో అదియే యున్నది' అనుటకంటెను వేరు విధముగా దానిని చెప్పనలవిగాదు. దాని ననుకరించుటకు భావనా ప్రపంచమునుండి విడివడియుండుటే మార్గము. అది సాధనపై ఆధారపడియున్నది. సత్కర్మ సత్ప్రవర్తన ద్వారా దానిని చేరవచ్చును. సంశయరహిత స్థితి ఇందులకు సాయపడును. కాని గమ్యము చేరుటకు ముందే ఈ స్థితియు అంతరించవలెను. అపుడు మాత్రమే సత్యస్థితియొక్క ఎఱుక కల్గును. ఈ ఎఱుకయు అంతరించినచో మనము దాని ప్రథమస్థితికి చేరినట్లు భావించవచ్చును.

ప్రకృతి చర్యలవలె మన చర్యలు సైతము పైన చెప్పబడిన స్థితితోనేకముగను సహజముగను ఉండుటకై మనము సత్యసంధతనలవరచుకొనవలెను. ఇచట భక్తి యారంభమగును. భక్తునకు భక్తి విషయమగు విధులు స్ఫురించును. అతని మనస్సులో ప్రభువును (*Master*) గూర్చిన స్మృతి హత్తుకొనును. ప్రియునియొక్క కాఠిన్యత ప్రేయసికి మనోరంజకముగ నుండును. కారణమేమనగా ఆ కాఠిన్యత యందు ప్రేమను ప్రతిబింబించు సౌకుమార్యము కనబడును. ఇది మిగుల నాకర్షణీయముగ నుండును. అట్లే ప్రేమించిన వ్యక్తి యొక్క పరుషవాక్యములు సైతము సంతోషమునే కల్గించును. ఈ పరుషవాక్యములను మొరటుదనముగ భావించినచో ఇవియే బాదాకరములగు అనుభవముల రూపము దాల్చి కష్టములనబడును. ఇవి అత్యంత పరుషములైనను ప్రేమికుడు వీనిని సంతసముతో స్వీకరించి భరించును. ఈ స్థితి కలిగినపుడు ప్రేమ పరుష వాక్యములచే గలుగదగిన యుద్రేకభావమును కృతజ్ఞతా భావముగ మార్చును. అట్లు భావించుట అవి తనను ప్రేమించిన వారి కడనుండి వచ్చుటచే అతడు వానినెట్లు స్వాగత పూర్వకముగ స్వీకరించెనో అతడెంత సంతసించెనో తెలుపును.

'దైవీ మార్గమున గల్గు విపత్తులను గూర్చి క్షోభ ప్రకటింపకుము. అది మర్యాద లక్షణముగాదు. బాధననుభవింపకయే ఎవరును సౌఖ్యమును పొందజాలరు' అని యొక కవి వాక్కు. దీని ఫలితము పరమానందమే. అతడు దానియందే నివసింప నారభించును. తగినంత సాధనచే ఇది అతని స్వభావముగా (సహజము) మారును. ఆ తరువాత ఆ విషయముయొక్క ఎఱుకయే అంతరించును. మోహపూరితమగు భ్రమయు నశించును. ఈ స్థితి కలిగినపుడు సత్యస్థితి వలయమున నోలలాడుట తప్ప మరేమి గలదు? అదియే సత్యస్థితి. కొంతకాలమునకు ఈ భావనయు నశించును. ఇట్లు తితిక్షా ఫలితముగా కలిగెడి శక్తి సహాయముచే అతడు పైన జెప్పిన పరిధిలో బ్రవేశించును.

సహజ మార్గసాధనా విధానములో ఇట్టి స్థితి అభ్యాసికి పలుమారు కలుగును. అది అతనికి సంతసము గూర్చును. తత్ఫలితముగా అతడాపరిధిలో బ్రవేశించును. అచట చిత్త ప్రశాంతతను అనుభవపూర్వకముగ గ్రహించును. ఇపుడు పైనుండి వచ్చిన ఈ వస్తువు అతనికెంత శ్రేయస్కరము. అపుడతడు బాహ్యమునకు బాధాకరముగను కటువుగను నున్న విషయములన్నియు తన శ్రేయస్సుకొరకే వచ్చినవని భావించును. అవి మనకు బహుమాన రూపముగ వచ్చినవగుటచే అమూల్యములగును. దానిచే గలిగిన సంతోషాతిశయముచే వానికి సహజముగనే కృతజ్ఞతా భావము వెల్లడించు నభిలాష కల్గును.

# ఆదేశము - 6

*'అందరిని సోదరులవలె భావించి వారియెడ ఆ విధముగనే వర్తింపుము'*

మనుజు డెప్పుడును భక్తి భావనా పరిధిలో నుండుటయే అతని మర్యాదకు పరమావధి. కేంద్రమునుండి వచ్చినవన్నియు ఒకే మూలమునుండి వచ్చినవను భావము నతడు కలిగియుండవలెను. అపుడతడు మాతృగర్భములో పోషింపబడి వెలువడినట్టి పసిపాప రూపము పొందును. ఒకే తల్లికి జన్మించిన బిడ్డలందరును ఒకే విధమగు బాంధవ్యము కలిగియున్నట్లు జగత్పిత సంతానమగు నందరును సోదరభావముచే బంధింపబడియున్నారు.

ఈ విషయములో నిమిడి యున్న రహస్యము పూర్తిగా నవగాహనము చేసికొనబడి యుండలేదు. ప్రతి వస్తువును క్రియా రూపములో ప్రవేశపెట్టిన తొలి క్షోభ ఏదికలదో అట్టి సత్యస్థితియే కేంద్రము. దానితో నందఱకు సంబంధము గలదు. దానిని వేరుపరచినట్టిది, వాస్తవమైనది ఏదియులేదు. మనభావములు, చర్యలయొక్క వ్యాప్తియే సోదరులమును మిత్రులమును నగు మనలను ఒకరికొకరు పరాయివారివలె మార్చినది. మన స్వార్థపరతయే. ఇతరులలో బ్రవేశించి వారు మనకు పరాయివారని తోచునట్లు చేసినది. సోదరసంబంధము మనలో నెలకొనవలెనన్నచో మనలో నాటుకొనియున్న ఈ బేధభావము నశింపజేయుట అవసరము. భక్తుని కనులను గప్పుతెరలలోనిది యొకటి. ఒక కుటుంబములోని వ్యక్తుల సంఖ్య అధికమైనకొలది వారిలో ఒకరికొకరికి దూరభావము స్వయముగనే కల్గును. అట్లే కాలము దూరము ఎక్కువగుకొలది సోదరులును, బంధువులును దూరస్థులైనట్లు కనబడుదురు. అందరును ఒకటే యనుభావము మన హృదయమునుండి అదృశ్యమైనట్లనిపించును. వారు మన సోదరులు, బంధువులు అను స్థూలభావము మాత్రము నిల్చియుండును. మనము ఆ భావమునే ప్రేమింతుము. ఏది మూలవస్తువై ఆ అన్నిటియందును వ్యాపించియుండెనో దాని నుండి మన దృష్టి మరలినది. ఆ వస్తువుయొక్క ప్రభావము నుండి ఏ ప్రతీక జన్మించెనో, అదియే మన దృష్టిలో మిగిలెను. మనము దీనినే మనకు వీలగునంతగా ప్రేమించితిమి. కాని ఆ ప్రేమయను దానిలో నిగూఢమై విరోధ

భావము ఇమిడియుండును. ఇట్టి భావమే స్థిరముగ నిలచి వ్యతిరేక ఫలము నిచ్చును. ప్రతి వ్యక్తియు ప్రత్యేకము అని తోచి ఒకరికొకరిమధ్య వేర్పాటు భావము కల్గించును. ఇవన్నియు గలసి వ్యక్తిగత బంధమువలె పరిణమించి మనుష్యునిలో చిత్తవృత్తిగా పరిణమించిన ఈశ్వరీయ దివ్యశక్తి ప్రవాహమే అన్ని ప్రాణులయందును ప్రవహించుచున్నదను జ్ఞానమే నశించును.

ఒకరొకరిని వేర్పరచునట్టి స్వకల్పిత భావనా వలయమును ఛేదించి అందరమును సోదరులమే యను భావమును మనస్సున హత్తుకొనునట్లు చేసికొనుటచే విశ్వైక సోదరత్వ భావన ఏర్పడును. ఈ భావన సహజముగా పరస్పర సన్నిహిత సంబంధముగా కనబడును. దీని యభ్యాసము మనకు నిజమగు జ్ఞానమును పొందుటకు సహాయపడును. అపుడు వాస్తవమగు వస్తువే మనయెదుట మిగిలిపోవును. ఈ వస్తువు సంపూర్ణముగ మన దృక్పథమునందున్నచో పరస్పరమైత్రి సంఘటనము అగును. ఈ సంబంధముతోడనే మన వ్యవహారము లెట్లు పరిణమించునో అట్లు మనము ఆ మైత్రియొక్క సౌరభము ననుభవింతుము. దీనివలన మనకు మున్ముందు సాధనా మార్గము సులభమైపోవును. ఇహలోకము పరలోకము యొక్క ప్రతిబింబమే. అందుచే ఈ ప్రపంచమును క్రమపరచినచో ఇది పవిత్రమై ఇది దేనియొక్క ప్రతిబింబమో ఆ ప్రపంచముపై ఈ ఫలితము సోకి అదియును పవిత్రమగును. ఇది మన పనిని సుకరము చేసి మన యాదర్శమగు గమ్యమును చేరుటకు సహాయపడును. ఇచట మన జయము అచ్చట మన విజయమునకు మార్గదర్శియగును. ప్రతిబింబమును కలుగజేయు ప్రపంచమనగా బ్రహ్మాండమని నా అర్థము. అచట సంభవించునదంతయు తేజో రూపముననుండి ఈ ప్రపంచమునకు స్థూలరూపమున వచ్చును. బ్రహ్మాండమునకు తేజోరూపమున వచ్చునదంతయు అంతకు పైనగల ప్రపంచమునుండియు, ఇట్లే క్రమముగా వచ్చును. ఈ క్రమములో ఈ ప్రపంచము చివర పొర. అందుచే దీనిని క్రమబద్ధము చేసినచో ఈ ఫలితము క్రమముగా అత్యున్నత స్థానమును చేరి అది సహజముగా సులభముగా పరిశుద్ధమగును. దీనివలన పైనున్న వస్తువు పరిశుద్ధమగుటకు మనము సహాయ పడుదుము. ఈ క్రమములో ఆ మొట్టమొదటి పొర శుద్ధమగును. ఇట్లు మన పని ఎంతసులభముగ నెరవేరుచున్నదో చూడుడు.

# ఆదేశము - 7

'ఏవనివలననైనను నీకు కష్టములు సంప్రాప్తమైనచో వానిపై ద్వేషము వహించి ప్రతీకారము చేయనెంచకుము. ఆ కష్టములు భగవంతుని కడనుండి వచ్చిన బహుమతులని భావించి కృతజ్ఞతతో స్వీకరింపుము.,'

మనకే కష్టము సంభవించినను అది మన కర్మఫలమేయనుటలో ప్రపంచమందలి మతములన్నియు నేకాభిప్రాయము గలిగియున్నవి. ఈ నియమమునకు వ్యతిరేకముగ ఎవరికిని ఎప్పుడును బాధ కలుగనేరదు. అందువలన మనకేది సంభవించినను అది మన విధివిలాసమేయని ఏల నిశ్చయింపరాదు? మన విధికి స్వయముగ మనమే కారకుల మనుట సత్యము. మనమేపనియైనను హృదయపూర్వకముగ చేసినచో, దాని ముద్ర, మూలమగు సద్వస్తువుపై బడి బీజరూపమున గురుతులు ఏర్పడి తత్ఫలితము అనుభవించుటచే ఆ గురుతులు తుడిచి వేయబడువరకు ఉండును. ఇట్లు కర్మఫల భోగము తప్పనిది. మొదట ఈ ప్రపంచములోనికి వచ్చునపుడు ప్రతివస్తువు ఎంత స్వచ్ఛముగ నుండెనో అట్లే అన్నిటిని స్ఫటికమువలె స్వచ్ఛముగా నుంచుటకు ప్రకృతి ప్రయత్నించును. ఇదియే ప్రకృతి నియమము. ఏకొద్ది మాలిన్యమైననూ దాని ప్రకాశమును కప్పివేయును. ఇదియును ఒక శక్తి యగుటచే ఒక విధమగు ప్రాణమును పొందును. దీనిని మనము చేయు కర్మతో సంబంధపరతుము. కారణమేమనగా దీనిని మనమే చేయుచున్నామను నహంభావము మనకు గల్గును. ఈ యహంకారమే మన హృదయ ఫలకముపై చెరగని ముద్రవేయును. ఇట్టి భావములు కొన్ని ప్రోగైనచో అవి పలు విధములగు చుట్టలుగా నేర్పడును. దానిలో గల ఊహాజనితమగు నుష్ణము చుఱుకుదనమును గల్గించి దాని యందొక విధముగ పొంగులు వారుటను ప్రేరేపించును. ఇందుచే దానియందలి చైతన్యశక్తి అధికమగునట్టి ప్రవృత్తి దానియందుండును. ఇది ప్రకృతి నియమము. దీనిననుసరించి ప్రతి వస్తువును తన మూలమునకు పోగోరును. ఉష్ణముయొక్క నిరంతర సంయోగముచే దాని స్థౌల్యత దుర్భరమగును. ఆ భారమును వదలించుకొనుటకు అది తన మూలమునకు పోవుట అనివార్యమగును. చిన్న వస్తువులలో

నుండి వచ్చిన వస్తువులు సైతము అవకాశము తగినంతయున్నచో వ్యాకోచము చెందును. ఈ పుట్టిన వస్తువులు సహజముగా శక్తివంతములై యుండును. అందుచే వాని విస్తరణ దానికవకాశముగల స్థలమును బట్టి శక్తివంతముగ నుండును. ఇట్టి స్థితిలో అది మరియొక మార్గముననుసరించి భోగముకొఱకు నియమితమగు ఆవరణములను సైతము ప్రభావితము చేయుచు అవకాశములుగల స్థలమునంతయు ఆక్రమించును. ఇపుడు బాధ మొదలిడును. ఇందలి ప్రతి విషయమును ప్రత్యేకోదాహరణముచే చెప్పదగియున్నను ఈ విషయము క్లుప్తముగా చెప్పుచున్నాను. కర్మఫలభోగమునకు ఈవిధముగా బాహ్యముగగాని అభ్యంతరముగగాని పరిస్థితులు ఉత్పన్నమగును. ఇతరులచే చేయబడిన అపకారము వలన కలిగెడి బాధయే దీనికి బాహ్య కారణము.

ఇవి లోపల పుట్టినను లేక బయటినుండి వీనికి సహాయము లభించినను ఆ వస్తువు ఎట్లైనను పరిశుద్ధముగావలెననుటయే అన్నిటి యుద్దేశము. తమ కర్మఫల భోగమునకు బయట సహాయమేది కలుగునో దానిని జనులు ఇతరుల వలన అపకారము లేక హింస కలిగినట్లు భావింతురు. అజ్ఞాన వశమున మనుజులు వారి కర్మఫల భోగముకొరకు ఏ బయటి వస్తువునుండి సహాయము కల్గునో ఆ విషయమై తమ భావములను విషపూరితములుగా చేసికొనుచున్నారు. ఇది అనుచితము, అన్యాయము. నిన్ను పరిశుద్ధునిచేయుటకై సహాయపడి ఒక విధముగ ఉపకారము చేసిన ఈ విషయమునెడల నీవు కృతజ్ఞతా బద్ధుడవు గావలసియున్నావు. ఇందుచే బాహ్య కారణము- అదేదైనను వ్యక్తియైనను సరియే- వలన జరిగిన కార్యమేదైనను అది మిత్రచర్యయే కాని సాధారణముగ మన భావన ఆ మేరకు పోలేదు. ఇట్టి చర్యయొక్క మూలతత్త్వము ఇంతకు ముందెన్నడును ఈ విధముగ వివరింపబడక పోవుటచే ఈ సిద్ధాంతము అసాధారణముగ కనబడవచ్చును. ప్రతి వియమును పరమేశ్వరుని కడనుండి వచ్చిట్లుగనే భావింపవలెనని సలహా యిచ్చుట అవి కల్పించిన వారిపై ఆగ్రహము కల్గి మన ప్రవర్తన కలుషితముగా కుండుటకొరకే. అందుచే ఎచటనుండియైనను కష్టము కల్గినచో అది చివరకు మన శ్రేయస్సు కొరకేగాన అట్టి వాని యెడల మన హృదయము అప్రయత్నముగా సంతసించి ఆ వ్యక్తి యెడగాని వస్తువునెడగాని కృతజ్ఞతా భావము గలిగించును.

# ఆదేశము - 8

'నీతితో పవిత్రమార్గమున నార్జించుటపై లక్ష్యమునుంచి నీకేది లభించునో దానిని సంతోషముగా భగవద్భావనతో భుజింపుము.,'

ఈ ఆదేశమందలి తత్వము స్థూలముతో నారంభించి మన గమ్యమగు సూక్ష్మముతో నంతమొందును. ప్రసన్నమగు చిత్తవృత్తి తన ప్రసన్నభావమును క్రింది పొరలపై సైతము సోకునట్లు పడియగట్టి వానిని పరిశుద్ధమొనర్చును. ఈ స్థితి దైవీస్థితికి ముందటిదని భావింపవచ్చును. దానిపై మనసు లగ్నము చేయుట యనగా మన అంతిమ గమ్యమును దృష్టిలో నుంచుకొనుటయే. మరియొక విధముగా చెప్పవలెనన్నచో దేని తరువాత అదియే (Only That) కలదో ఆ స్థానమునుండియే మనము బయలుదేరుట. ప్రకృతిచే స్వయముగా పడుగు పేకల రూపమున కలిపివేయబడినది ఇదియే. దీనిని ప్రకృతి యొక్క భౌతికావస్థ అనవచ్చును. కాని భౌతికము అనునది నామమాత్రమే. ఇది సద్వస్తువుయొక్క సహజస్వభావమును తెలియపరచును. ఇది మానవుని యొక్క భావనా వలయములోనికి వచ్చుటచే భౌతికము అను పదముపయోగింపబడినది. మనము దీనిని మాయ యొక్క మేలిముసుగు అని అపార్థము చేసికొనవచ్చును. కాని అది సరిగాదు. ఈ స్థితి మాయావరణము నందంతటను వ్యాపించియుండును. భోజన సమయమున ఈ స్థితిని మనము భావించినచో దాని ఫలితము పడియగట్టబడి తత్ప్రభావము ఆహారముపై బడును. అట్టి యాహారమును భుజింపగనే దాని ఫలితము శరీరములో ప్రవేశించి రక్తనాళములందంతటను వ్యాపించును. మనము వెలుపలి నుండి లోపలికి తీసి కొనిన పదార్థము సద్వినియోగమైనదని దీని భావము. దీనిచే శరీరమందలి యణువులు సూక్ష్మాణువులు పవిత్రములగును. అందుచే జనించు భావప్రేరణ ఆహారముతో గలిసి మన శారీరక, ఆధ్యాత్మిక ఆరోగ్యమునకు సహకారియగును. ప్రాణశక్తి సర్వవ్యాపి యగుటచే దాని ప్రధానపను పరిధినుండి ఏదియు తప్పించుకొన జాలదు. ఇది ఆహారమునకు వెలుపలను లోపలను గలదు. దీనితో మన భావనాశక్తిని అనుసంధానము చేసినచో రాపిడిచే నగ్నికణము పుట్టునట్లు నూతనమగు శక్తి పుట్టును. అది దానికంటెను దివ్యముగను పరిశుద్ధముగను ఉండును. సత్యతత్త్వముతోడి సంసర్గమువలన ఉద్భవించిన శక్తి మనలను పరతత్త్వము వైపుగొంపోవును. దానికంటెను

క్రింది శక్తి అందుకు సమర్థముగాదు. మానవుని యూహాశక్తి అచటివరకు పోజాలదు. ఇది ఆద్యంతరహితమగు స్థితికి మన మార్గమును సుగమము చేయును. అన్నమునందు పరిశుద్ధతా సంకల్పము చేయుటచే దానియందు మనము కల్పించిన శక్తి, దానివలన ఉద్భవించిన యగ్నికణము, ఏ స్థితి పరమాత్మకు గల స్థితియని చెప్పితిమో, ఆ పటలము వరకుమనల గొనిపోవును.

భోజనము చేయునపుడు భగవంతునిపై ధ్యానముతో భుజింపవలెను. ఇది మన కర్తవ్యముగ నిర్దేశింపబడినది. అందుచే మనము చేయు ప్రతి కర్మయు మన యాదర్శమగు ధ్యేయ ప్రాప్తికి సహాయపడునట్లుండవలెను. భోజన సమయమున మన ధ్యేమగు పరమేశ్వరుని పై మన భావము నిల్పుటచే తత్ఫలితమును, దాని సహవాసమును మనము పొందుదుము. అందుచే మన పవిత్రత నభివృద్ధి చేసికొందుము. మనము అతి పవిత్రమగు మూలమునుండి వచ్చితిమి. మన జననమునకు కారణమగు పవిత్రశక్తి ప్రవాహము ఆ పరమ పవిత్ర స్థానమునుండియే ఉత్పన్నమైనది. అందుచే మనలో పవిత్రతా భావన సహజముగానే నెలకొనియున్నది. దానిలోనికి ఏ యపవిత్రతయు ప్రవేశింపజాలదు. సర్వసంహార సమర్థమగు కాలము సైతము దానిని చెనకజాలదు. అత్యంత శక్తివంతమగు మూలమునుండి ఈ ప్రవాహము వచ్చినందున అది మిగుల పరిశుద్ధతచే నిండి యున్నది. నిజముగా ఈ ప్రవాహము జగత్సృష్టికి కారణమైన 'భూమ' యొక్క ఝుంకార పరిణామమే. ఇట్టి పరమ పవిత్రమైన దానివలన ప్రభవించిన ప్రతి వస్తువును మొదట పవిత్రముగనే యుండెను. కాని కాలప్రభావము వాని పవిత్రతను కలంకపరచెను. నాల్గవ ఆదేశములో తెలిపినట్లు ఇది మన చర్యల ఫలితమే,

ప్రకృతియందు లభించెడి ప్రతి వస్తువు అతి పవిత్రమైనది. దాని మూలము పవిత్రమైనదిగదా! మనము సంపాదించెడి వస్తువులుగూడ నైతికమును పవిత్రము అగు మార్గమున సంపాదింపబడినచో అవియును పవిత్రములేయగును. వాని ప్రభావము సమీపముననున్న యావరణములను సైతము ప్రభావితము చేసి మానవశరీరమను ఈ సాలీడు గూటిని సైతము పవిత్రము చేయును. పవిత్రమార్గమున సంపాదింపబడిన వస్తువులకు మహర్షులు అత్యంత ప్రాముఖ్యత నొసగుట కిదియే కారణము.

# ఆదేశము - 9

'నిన్ను చూచినపుడు ఇతరులకు పవిత్రభావము, ప్రేమ, భక్తి రేకెత్తునట్లు నీ జీవిత వ్యవహారములు ఉత్తమమగు నట్లు మలచుకొనుము.'

మన భావననుండియే మనకు శక్తి కల్గును. ఇది ఎప్పుడగును? మన సృష్టికిని ఈశ్వరసృష్టికిని మధ్య నైసర్గికముగా మధురమగు సమత్వభావమును మనము సృష్టించుకొన్నపుడే ఇది సాధ్యమగును.

వ్యవహారమను పదమునకు మిగుల విపులమగు నర్థము గలదు. పరతత్త్వమునకు తరువాతగల విశ్వమునంతయు ఈ పదము ఆవరించుకొనదగు వ్యాపకముగలదై యున్నది. పరమేశ్వరుని కార్యములలో సమత్వము గలదు. కాని అది ఒక ప్రత్యేకార్థములో మాత్రమే గలదు. అతడు అందరకును సమానముగ వెలుగును, శ్వాసించుటకు గాలిని, త్రాగుటకు నీటిని ప్రసాదించును. ఇట్లు ప్రాణికోటి పెరుగుటకును మన యునికిని పోషించుటకును అతడెన్నియో సృష్టించియున్నాడు. ఇదియే ప్రకృతి చర్యల యందలి సమత్వమని చెప్పనగును.

మరికొన్ని విషయములలో వాని వ్యవహారము వేఱువిధముగ నుండును. అవి ప్రత్యేక విధముగా వర్ణింపబడినవి. మన యెదుట బంకమట్టి ముద్ద నుంచినపుడు ఆ ముద్దపై మనకు గలుగు అభిమానము కంటెను దానితో జేయబడిన వస్తువుపై మనకు అభిమాన మెక్కువగా నుండును. అట్లే మనుష్యుడు తన ప్రవర్తనను సరియగు పద్ధతిలో మార్చుకొని భగవంతుని సమీపించినచో అయన దృష్టి వాని విషయములో వేరొక విధముగ నుండును. అందుచే అయన దృష్టిని మనపై కేంద్రీకరించుటకు సహాయపడు విధమున మనము మన ప్రవర్తనను మార్చుకొనవలెను. ఆయన దృష్టి మనపై పడవలెననగా మనము వెలుగును నేరుగా బడయుటకు భూమధ్య రేఖ గావలెను. భగద్వ్యవహారమిట్లున్నది. మనము దీని ననుకరించవలెను. మన యెడల భగవంతుడు ఎట్టివి చేసెనో, ఎట్టివి

చేయుచున్నాడో అట్టి వ్యవహారములే మన దైనందిన జీవితములో మనము చేయవలెను. ప్రకృతియందలి ఈ రహస్యమును గమనించి మనము మన నిత్య జీవితములో దీని నాచరణయందున్పుంచవలెను. పైన వివరించిన ప్రకృతి వ్యవహారములు పలు విధముల వ్యక్తీకరింపబడినవియున్నవి. వస్తువులయందలి వివిధ వర్ణములు దీనికి తార్కాణము. పూదోటలో వికసించిన పుష్పములలో ఒకటి ఎఱ్ఱగను దానిప్రక్కనేగల మరియొక పుష్పము పసుపు లేక నీలముగను ఉండును. ఇట్లు ప్రకృతి వివిధ వర్ణములలో తన ప్రకాశమును వ్యక్తము చేయుచు ప్రతి వస్తువు తన యోగ్యత, సామర్థ్యములకు దగిన రీతిని ప్రకృతి శక్తిని స్వీకరించునట్లు చేయును. అనగా ప్రకృతి వాని విషయములో ప్రత్యేక పద్ధతిలో వ్యవహరించును. ఈ విషయము దృష్టిలో నుంచుకొని మనము ఇతరులయొక్క అవసరములకు హక్కులకు అనుగుణముగా మన వ్యవహారములను చక్కబఱచుకొని వానిని ప్రకృతి వ్యవహారములతో తాదాత్మ్యముగా నుండునట్లు చూచుకొనవలెను. ఈచర్య దానికి దాని ఫలితమునకు నూతనమగు శక్తినిచ్చును. ఇందుచే ప్రజలు మనచే నాకర్షింపబడుదురు. ఈ వస్తువు సరిగా సమకూర్చినచో మఱియు దీని యందలి భాగము ఇతరులకీయనిచ్చగించినచో వారి యాకర్షణ స్వయముగ మీ వైపు వాలును. ఈ యాకర్షణమునే ప్రీతియందురు. ఇతరుల యోగ్యత నీ దృష్టియందున్నపుడు సామరస్యము పుట్టుటవలన నీలో కలిగిన శక్తి ప్రభావమునకు అధీనులైన ఇతరులకు వారి హృదయములందు నీపై ప్రేమ జనించి నీ విషయములో వారు నీకనుగుణముగ ప్రవర్తింతురు.

# ఆదేశము - 10

'రాత్రిపరుండబోవుటకు ముందు భగవంతుని సన్నిధానమును భావించి పొరపాటున చేసిన తప్పులకు దీనతతో పశ్చాత్తాపమును తెల్పుకొనుము. అట్టి తప్పులను మరల చేయనని నిశ్చయించుకొని వినమ్రుడవై క్షమాభిక్షను అర్థించి ప్రార్థింపుము.'

ప్రభువు (Master) ను నిజముగా ప్రభువేయని గుర్తించి తా నాతని సేవకు సంపూర్ణముగ నియుక్తుడైన దాసుడనని భావించుటయందే మానవ జీవితమునకు పరిపూర్ణత గలదు.ఇట్లు చేయుటచే ఒక వ్యక్తి తనలో (Negation) నాదేదియులేదు అనుభావమును సృష్టించుకొనును. ఈ భావము భగవంతుని దృష్టిని మనవైపున కాకర్షించి ఆయనతో మనకు సంబంధము కల్పించును. ఇపుడు మనము చేయు పనులన్నియు భగవంతునకును మనకును మధ్యగల సంబంధము విచ్ఛిన్నము గాకుండునట్లును, ప్రభువుయొక్క గొప్పధనము (ప్రభావము) మన హృదయముపై ముద్రపడి మనము భగవంతుని ప్రత్యక్ష దృష్టిలో నుండునట్లును, చేయవలయునను భావముతో చేయుదుము.

భక్తునకు భగవంతుని దృష్టి ఎల్లప్పుడును తనవైపే ప్రసరించునట్లును, తానాయనకు అత్యంత సమీపముగ నుండునట్లు చేసికొనుటకంటెను తప్ప వేరొక విషయముతో పనిలేదు. అపుడు హృదయమందలి ఔదార్యత, సారళ్యత మరొక క్రొత్తమలుపుతిరుగును. భగవంతుని తన ప్రభువుగా స్వీకరించిన తరువాత భక్తుడు తానునేరస్థుడను భావముతో తెలిసియు, తెలియకయు చేసిన దోషములను, నియమవిరుద్ధములగు కార్యములను ఆయన యెదుట మనవిచేసికొనవలెను. ఇట్లు చేయుటచే మన నిస్సహాయస్థితి స్పష్టమగును. ఈ విధముగ తన వినమ్రభావమును భగవంతునకు నచ్చునట్లు చేసినచో ఆయనకు తన భక్తుడు చేసిన దోషములను ప్రార్థనా పూర్వక హృదయముతో పశ్చాత్తాపమును వెలిబుచ్చుటచే, అతడు క్షమింపబడుటకు అర్హుడే యనుభావము కలుగును. ఏలయనగా నిస్సహాయస్థితి యొక్క కల్పన భక్తుని హృదయమున గలదు. అందుచే నతడీవిషయమును స్వామిఎదుట నివేదించినాడు. దీనిలో నొక సున్నితమగు మార్దవము, మాధుర్యము కలవు. దీనిని

మాటలచే వ్యక్తము చేయుటకు వీలు గాదు. ఈ మాధుర్యము యొక్క చిత్రము మఱియొక చోట కనబడును. మఱియు అది దౌర్భల్యముయొక్క సంపూర్ణ విశ్వాసమును కలుగజేయును. అనగా వానిలోనున్న ప్రతిబంధకములు నశించి వాని భారము పోయినదని భావము. దీనిచే వానిహృదయము ఇప్పుడు నిర్మలమై యున్నది. కావున భక్తుడు మల, విక్షేప, ఆవరణాది దోషరహితమైన పరమేశ్వరుని దివ్యశక్తి ప్రవాహమువలెస్వచ్ఛమగు స్థితిలో నుండును. ఈస్థితి ప్రకృతి సార రూపమగు సరళత అను స్థితిని పోలియుండును.

ఈస్థితి యభివృద్ధియైనచో దీనిలో నతడు సంపూర్ణముగ లీనమైతినను భావము కలుగునట్లు చేయును. తప్పులు చేయుట మానవ నైజమగుటచే భక్తుడు సంపూర్ణముగ దోషరహితుడు కాజాలడు. కాని ఆ దోషములు నిర్జీవములై యుండును. భగవంతునితో భక్తి పూర్వకమగు సంబంధమును కల్పించుకొనకముందు మనుష్యుడు ఘోరమగు దోషము లొనర్చి యుండవచ్చును. కాని ఈ సంబంధ మేర్పడిన తర్వాత అతని భావనా బలముచే ఆదోషములు పశ్చాత్తాపముగా పరిణతినంది బలహీనములై చివరకు నశించును. పశ్చాత్తాపమనగా భక్తునిలో ఒక విధమగు శూన్యస్థితిని కలిగించుటకు ఊహాతరంగము (భావనాపరంపర) లకు కలుగునట్టి తీవ్రసంచలనము మాత్రమే. అపుడు పైనుండి దివ్యశక్తి వానిలోనికి ప్రవహించి దానిని ప్రకృతి కనుగుణముగ మార్చును. ఇట్లు వచ్చిన శక్తి పూర్వసంస్కారఫలితములను క్షాళనచేయుటకు సహాయపడును. నిజమగు పశ్చాత్తాపమనగా నిదియే.

వినమ్రభావము సైతము ఒక విధమగు భక్తి భావమేయగును. దీనియందు పసిబిడ్డయందలి అమాయకత గోచరించును ఈస్థితినిపొందిన వాడు ఒక విధముగ సర్వమును సాధించినవాడే. కాని పైకి అతడట్లు కనిపించడు. అట్టి స్థితిలోనున్నవాని దోషఫలము నశించినదగుటచే ఆ దోషము దోషముగాదు. ఏలయన ఈస్థితి వానిని సంపూర్ణముగ శుభ్రపరచినది.

భక్తియొక్క మరియొక స్థితి ఇపుడు కలుగును. తప్పులను చేయవలదని ఈస్థితి అతనికి హెచ్చరికచేయును. ఈస్థితి సర్వశక్తియుతుడగు ప్రభువునకు తాను మరల తప్పులను చేయకుండునట్లురక్షణగా తానున్న స్థితితో తనకు సంతృప్తిని గూర్చు నట్లు చేయు ప్రార్థనగా పరిణమించును. మనము భక్తి భావముతో భగవంతుని సన్నిధిని చేరితిమి. గావున ప్రకృతి నియమముల నుల్లంఘించునట్టి ఏ పనియు చేయక విధి నియమములకు లోబడి ప్రవర్తింపవలసిన యవసరమేర్పడును. తనకును భగవంతునకును

మధ్యగల దూరము వీలగునంత తక్కువగా చేసికొన్నచో, అనగా భగవంతునకు వీలగునంత సన్నిహితుడుగా నుండునట్లు చేసికొనినచో ఇది సాధ్యమగును. ఇందులకు భగవంతుడెల్లప్పుడును మన హృదయకమలమునందే నెలకొనియున్నాడను నిరంతర భావనయే ఉత్తమమగు మార్గము.

ఈభావన రాత్రియందు నిద్రింపబోవుటకు ముందు కలుగజేసికొనుట చాల మంచిది. కారణమేమనగా ఆ సమయమున మనుష్యుడు ప్రాపంచిక వ్యవహారములన్నిటినుండి విడివడి విశ్రాంతి కావలయుననెడి భావనతో నుండును. అతడొక విధమగు స్వేచ్ఛాస్థితిలో నుండును. ఈ స్వేచ్ఛాస్థితి ప్రకృతి సిద్ధమగు తితిక్షావస్థ యనవచ్చును. నిద్రింపబోవుసమయమున చేయబడు ఈ ప్రార్థన మిగుల శక్తి గలిగి ఫలప్రదమగుననుటకు ఇదియే ముఖ్య కారణము. అట్టి ప్రార్థనా భావముతో చేసెడి చర్యలన్నియు సక్రమముగా నుండును. అందుచే మనము కాలముననుసరించి చేయవలసిన కార్యములను చేసి దాని నుండి పొందగలుగు సత్ఫలితములను పొందవలెను.

ఓమ్ శాన్తిః శాన్తిః శాన్తిః

# అభ్యాసులు ధ్యానము చేయువిధానము

## ఉదయము - ధ్యానము

పూజకై ప్రత్యేకించబడిన స్థలములో ఒకే ఆసనమునకూర్చుండి శారీరక, మానసిక శుభ్రతలను కలిగి, నిత్యము, నిర్ణీత సమయమునందు సూర్యోదయమునకు ముందే ఒక గంటకాలము ధ్యానము చేయుము.

హృదయములో దివ్యతేజస్సు కలదను భావము కల్గి, మనస్సుపై ఒత్తిడిలేకుండా, సహజముగా ధ్యానము చేయుము. అక్కడ తేజస్సు కనబడనిచో లెక్కచేయకుము. అది ఒక ఊహగా ధ్యానము ప్రారంభింపుము. ఏకాగ్రతకై ప్రయత్నించక, సహజపద్ధతిలో ఒకే ఆసనమున కూర్చుండి మనస్సును హృదయమువైపు మరల్చుము. ఆసమయమున వచ్చు ఆలోచనలను ఆహ్వానించకయే వచ్చిన అతిధులుగా భావించి, వాటిని గమనించక, దృష్టిని ఏకైక లక్ష్యముపై నిలుపుము.

## సాయంకాలము - అంతఃశుద్ధీకరణ క్రియ

నీ ఆధ్యాత్మిక ప్రగతికి ప్రతిబంధకములైన మాలిన్యములు, జడత్వము, తామసము, సంస్కారములు మొదలగునవి నీలోని ప్రత్యణువునుండి, ఆవిరిరూపములో నీ శరీరము వెనుక భాగము నుండి బయటికి పోవుచున్నవి అను సంకల్పముతో సాయంకాలము అరగంట కూర్చుండుము. నీవు విడువదలచిన వాటిని గుఱించి ధ్యానమున తలచకుము. సరళముగా వాటిని తుడిచివేయుము.

## ప్రార్థన

ప్రభూ! నీవే మానవ జీవనమునకు లక్ష్యము.
మాకోరికలు మా ఆత్మోన్నతికి ప్రతిబంధకములై యున్నవి.
నీవే మా ఏకైక స్వామివి మరియు ఇష్టదైవమువు.
నీ సహాయములేనిదే నిన్నుపొందుట అసంభవము.

రాత్రి నిదురించుటకు ముందు వినమ్రభావముతో పై ప్రార్థన ఒకటి రెండు సార్లు మనస్సులోనే ఉచ్ఛరించి దానియందుగల భావముపై ధ్యానము చేయుచు, దానియందే లీనమై నిదురించుము.